



అన్నింటా ఆమె

స్వశక్తితో ఎదిగి.. సమాజానికి స్ఫూర్తిగా నిలిచి..

విభిన్న రంగాల్లో రాణిస్తున్న మగువలు

అనురాగం, ఆత్మీయతల కలబోత ఆమె. అన్యోన్యతకు నిలువెత్తు నిదర్శనం ఆమె. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా.. సమాజంలో ఆమె పోషించే ప్రతిపాత్ర ఓ అద్భుతమే. అందుకే ఆమె ఆకాశంలో సగమైంది. బేషజాలకు తావులేని మమకారం.. భేదాలు చూపని గొప్పగుణం.. కష్టసుఖాల్లో సహకారం.. స్త్రీమూర్తికి పెట్టని ఆభరణాలు. మగవారితో సమానంగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన అతివ వంటింటికే పరిమితం కాలేదు. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే..' అన్నట్టు ఉద్యోగాల్లోనే కాకుండా.. ఇష్టమున్న ప్రతి రంగంలో ప్రగతి సోపానంతో పడతి ప్రయాణిస్తోంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయపథాన దూసుకుపోతున్న మహిళామూర్తులపై

ప్రత్యేక కథనాలు 8లో..



● కోమరవోలులో భువనేశ్వరి

సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం తాను దత్తత తీసుకున్న పామర్రు మండలం కోమరవోలు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు.

6లో

టెన్షన్ టెన్షన్

పలు కేసుల్లో విచారణకు నోటీసులివ్వాలని పోలీసుల చుట్టూ కొడాలి అనుచరుల ప్రదక్షిణలు

ఇప్పటికే కీలకమైన కేసుల్లో చిక్కుకుని భయాందోళన

అధికారం ఉన్నంతకాలం రెచ్చిపోయారు. కన్నూమిన్నూ కానకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. బెదిరింపులు, కబ్జాలకు పాల్పడ్డారు. అధికారం మత్తు దిగాక.. గుడివాడలోని అరాచక శక్తులకు ఇప్పుడు భయం పట్టుకుంది. మాజీమంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరులు, ఇతర అనుయాయుల్లో టెన్షన్ మొదలైంది. చేసిన తప్పులకు శిక్షలు తప్పవని ముందస్తుగా విచారణలు ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు.

- ఎప్పుడైనా చిక్కుకోక తప్పదని ముందే ప్రయత్నాలు
- గుడివాడ పీఎస్‌కు వెళ్లి నోటీసులివ్వాలని వేడుకోలు
- వన్‌టౌన్ పోలీసుల నోటీసులు, టూటౌన్‌లో ససేమిరా..
- భయంభయంగా కొడాలి అనుచరులు శశిభూషణ్, రాంప్రసాద్
- నాటి అక్రమాలపై రోజురోజుకూ బిగుస్తున్న ఉచ్చు

అనుంగు అనుచరులు

మాజీమంత్రి కొడాలి నాని.. తన అనుచరులు పాలడుగు రాంప్రసాద్, దుక్కిపాటి శశిభూషణ్‌పైనే ఆధారపడతారు. నాని చెప్పకుండా వీరు ఎలాంటి పనులు చేయరు. రానున్న రోజుల్లో వీరిద్దరినీ విచారణ చేయాల్సి వస్తే.. వారిద్దరూ కొడాలి నాని పేరు చెబితే ఆయనకు చిక్కులు తప్పవు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించారు. రాజీనామాలు చేయని వారిని చేసే వరకు బెదిరించారు. గుడివాడలోనూ ఈ వ్యవహారం నడిచింది. దీనిపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది మాజీమంత్రి కొడాలి నాని, వైసీపీ గుడివాడ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్‌పై కేసులు నమోదయ్యాయి. బీఎన్ఎస్ 447, 506 సెక్షన్లను ఈ కేసులో నాని ముందుగా హైకోర్టును ఆశ్రయించడంతో 41ఏ నోటీసులు ఇచ్చి విచారించాలని కొద్దినెలల క్రితం పోలీసులకు ఆదేశాలు అందాయి. ఈ విచారణకు హాజరుకావాలని నానికి కోర్టు స్పష్టం చేసింది. ఆటోనగర్‌కు చెందిన దుగ్గిరాల ప్రభాకర్ అనే వ్యక్తి బేవరేజెస్ కార్పొరేషన్‌కు గోడౌన్‌ను అద్దెకిచ్చాడు. వైసీపీ అధికారంలోకి రాగానే లీజు, లైసెన్స్‌ల గడువు ముగియకముందే వేరేచోటకు తరలించారు. దీంతో మనోవేదనకు గురై తన తల్లి మృతి చెందినట్టు ప్రభాకర్ ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ మాధవీలత, మాజీమంత్రి ఎమ్మెల్యే కొడాలి నాని, మరికొంతమంది వైసీపీ నాయకులపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 448, 427, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద గత జూలై 6న కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఉన్న శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్ శుక్రవారం గుడివాడలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తమకు 41ఏ నోటీసులు ఇవ్వాలని పోలీసులను అడిగారు. వన్‌టౌన్ పోలీసులు నోటీసులు ఇచ్చినా.. టూటౌన్ నోటీసులు ఇవ్వడానికి ససేమిరా.. అనడంతో వెనుదిరిగారు. సాధారణంగా కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి పోలీసులు ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేస్తారు.



విచారణకు ఏ తేదీన హాజరుకావాలో చెబుతారు. అటువంటిది గుడివాడలో వైసీపీ నేతలు నోటీసులు తీసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లడం గమనార్హం.

బిగుస్తున్న ఉచ్చు

- అధికారంలో ఉండగా మాజీమంత్రి కొడాలి నాని చంద్రబాబుపై ఒంటికాలిపై లేచేవారు. నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడేవారు. కుటుంబ ప్రస్తావన తీసుకొచ్చి ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి చంద్రబాబు ప్రస్తుత కుటుంబ సభ్యుల వరకు తిట్టని రోజు లేదు. వీటిపై ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు.
- ల్యాండ్ గ్రాబింగ్‌కు సంబంధించి కూడా కొడాలి నాని అనుయాయుల వ్యవహారాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. వీటికి సంబంధించి కూడా బాధితులు కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది.
- గుడివాడ బైపాస్ రోడ్డు వెంబడి ఓ ప్రైవేట్ వెంచర్‌లో ప్రభుత్వ ఉద్యోగులు

మిగతా 6లో..

ఓపెన్‌గా మాస్ కాపీయింగ్

జగ్గయ్యపేటలో బయటపడుతున్న అక్రమాలు

- స్థానిక హెచ్‌ఎంలకు సిట్టింగ్ స్క్వాడ్‌లో చోటు
- నిబంధనలకు విరుద్ధంగా ఏఐ కోఆర్డినేటర్లకు కూడా..
- స్క్వాడ్‌లా వెళ్లి విద్యార్థులతో కాపీయింగ్
- సీసీ కెమెరాల్లో కనిపించకుండా జాగ్రత్తలు
- ఓ కళాశాల పీఆర్వోను నిలదీసిన విద్యార్థులు
- డబ్బులు తీసుకుని పరీక్షల్లో హెల్ప్ చేయట్లేదని నిలదీత



పీఆర్వోను చుట్టుముట్టిన విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ సంచలనం రేపుతోంది. ఓపెన్ ఇంటర్‌లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ లోపాయికారీ ఒప్పందాలతో అధికారులు, పలువురు కో-ఆర్డినేటర్లు కుమ్మక్కై యథావిధిగా కాపీయింగ్‌కు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. జగ్గయ్యపేటలో జరుగుతున్న పరీక్షల్లో మాస్ కాపీయింగే ఇందుకు ఉదాహరణ.

మాస్ కాపీయింగ్ ఇలా..

గతంలో రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్ పరీక్షలు వేర్వేరుగా నిర్వహించేవారు. ప్రైవేట్ కళాశాలల వారే సెంటర్లు ఏర్పాటుచేసి, అభ్యర్థులతో పైరవీలు చేసి ముందస్తు ఒప్పందాలతో, తప్పనిసరిగా పాస్ సర్టిఫికెట్ అంటూ వేలాది రూపాయలు వసూలు చేసేవారు. ఈసారి ఓపెన్, రెగ్యులర్ పరీక్షలు ఒకేసారి జరగటంతో పరీక్షా కేంద్రాలుగా తమ కళాశాలలకు అవకాశం లేకుండాపోయింది. విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఫీజులు కట్టించుకునేందుకు ప్రభుత్వ హైస్కూళ్లు, కొన్ని ప్రైవేట్ స్కూళ్లకు ఏఐ కోఆర్డినేటర్లుగా అవకాశం కల్పించారు. నిబంధనల ప్రకారం ఏఐ కోఆర్డినేటర్లుగా ఉన్న ఉద్యోగులు.. సిట్టింగ్ స్క్వాడ్‌లలో ఉండకూడదు. కానీ, జగ్గయ్యపేటలోని ఓ హైస్కూల్ హెచ్‌ఎంకు స్థానికంగా ఉన్న రెండు ప్రైవేట్ స్కూళ్లలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌గా అవకాశం కల్పించారు. ఆమె ద్వారానే మాస్ కాపీయింగ్‌కు తెరలేపినట్టు ఆరోపణలు వస్తున్నాయి. సిట్టింగ్ స్క్వాడ్ పేరుతో అక్కడ పరీక్షా కేంద్రాల్లో తిష్టవేసి తమ విద్యార్థులకు కాపీలు అందిస్తున్నట్టు, అక్కడ సీసీ కెమెరాలు పనిచేయకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రెగ్యులర్ ఇంటర్ కోర్సులు

మిగతా 6లో..

పాఠశాలల్లో కనిపించని ఉపాధ్యాయులు

ఓపెన్ ఇంటర్, రెగ్యులర్ ఇంటర్‌కు ఒకేసారి పరీక్షలు రావటంతో మండలంలో అత్యధిక ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లగా నియమించటంతో ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులుగా బోధన సాగట్లేదు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా పరీక్షల బాధ్యతలు అప్పగించటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

చెరువు కట్టకు మోక్షం

- గుడివాడలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తెగిన కట్ట
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల
- కొడాలి నాని హయాంలో పట్టించుకోక అవస్థలు

6లో



మామిడి రెడీ

మూడోవారంలో ప్రారంభంకానున్న ఎగుమతులు

- నున్న మార్కెట్‌లో షాపులు తెరిచేందుకు సిద్ధం
- పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ రూరల్) : మామిడి సీజన్ వచ్చేస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద మామిడి మార్కెట్‌లో ఒకటైన నున్న మ్యాంగో మార్కెట్‌లో ఈనెల మూడో వారంలో షాపులు తెరిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మార్కెట్‌లో మొత్తం 40 దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే మామిడి కాపునకు రావడంతో వ్యాపారులు దుకాణాలను సిద్ధం చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. రైతుల నుంచి మామిడి కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కరోనా నుంచి తగ్గిన వ్యాపారం

నున్న మ్యాంగో మార్కెట్‌లో గతంలో మూడు పూలు ఆరు కాయలుగా ఉన్న మామిడి ఎగుమతులు కరోనా నుంచి తగ్గుముఖం పట్టాయి. ఓపక్క వాతావరణం అనుకూలించక మామిడి దిగుమతులు తగ్గడం వలన సతమతమైన వ్యాపారులు కరోనా కాలంలో మరింతగా దెబ్బతిన్నారు. ఈ ఏడాదైనా దిగుబడి పెరిగి వ్యాపారం అభివృద్ధి చెందుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఇక్కడి నుంచి దేశంలోని పలు రాష్ట్రాలకు మామిడి కాయలు ఎగుమతి చేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలని చూస్తున్నారు. బంగినపల్లి, చెరుకు రసాలు, నీలాలు, కోలాపూరీ, చిన రసాలు, పెద్ద రసాలు, సుందరి తదితర రకాలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి.

లోకల్ మండీలతో కష్టాలు

నున్న మ్యాంగో మార్కెట్‌కు ప్రధానంగా నూజివీడు, విస్సన్నపేట, ఆగిరిపల్లి, తాడేపల్లిగూడెం, ఏలూరు, ద్వారకా తిరుమలతో పాటు తుని, అన్నవరం ప్రాంతాల నుంచి రైతులు మామిడి పంటను దిగుమతి చేస్తుంటారు. అయితే, ఆయా ప్రాంతాల్లో కొంత

మిగతా 6లో..

లెక్క చిక్కేనా..?

ట్రెజరీశాఖలో దొంగలు పడ్డారు. అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న కీలక ఉద్యోగులు తమకున్న సాంకేతిక నైపుణ్యంతో పింఛన్లు, ఇతరత్రాల బిల్లుల పేరుతో పెద్దమొత్తంలో నగదును దారి మళ్లించి, తమ ఖాతాలకు జమ చేసుకున్నారు. ఆడిట్ చేసే సమయంలో ఈ వివరాలు వెల్లడికావడంతో ఈ అక్రమాల బాగోతం బయటపడింది. రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు మచిలీపట్నంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో విచారణ జరుపుతున్నారు.

అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయ అక్రమాల బాగోతం

సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రూ.1.50 కోట్లు స్వాహా

- కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులదే ప్రధాన పాత్ర
- జిల్లా ట్రెజరీ కార్యాలయానికి నెలనెలా మామూళ్లు?
- ఉన్నతాధికారి పాత్రపైనా అనేక అనుమానాలు
- అవనిగడ్డ సబ్‌ట్రెజరీ లాగిన్ నుంచే నగదు మళ్లింపు
- జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఎస్‌టీవో, అకౌంటెంట్ తమ తెలివితేటలను ఉపయోగించి ప్రభుత్వ నిధులను పెద్దమొత్తంలో పక్కదారి పట్టించేశారు. ఉన్నతాధికారుల అండదండలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని వీరు ఆడిన ఆట ఎట్టకేలకు బయటపడింది. ఈ వ్యవహారంలో అవనిగడ్డ సబ్‌ట్రెజరీలో కిందిస్థాయి సిబ్బంది నుంచి జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారుల పాత్ర ఉండటంతో విచారణ సక్రమంగా సాగుతుందా, లేక మమ.. అనిపిస్తారా అనే అంశంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.

జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అధికారులు

అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తమ ఖాతాలకు సుమారు రూ.1.50 కోట్లకు పైగా నగదును మళ్లించుకున్నారనే సమాచారంతో ట్రెజరీ విభాగం డైరెక్టర్ ఎం.మోహనరావు, జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.రవికుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం అవనిగడ్డ కార్యాలయంలో విచారణ చేశారు. ఈ కార్యాలయంలోని రికార్డులను వారు స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఆధారంగా చేసుకుని మచిలీపట్నంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం లెక్కలు తేల్చే పని చేపట్టారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్ నగదు, ఇతరత్రాల రూపంలో నగదు ఎంతమేర పక్కదారి పట్టిందనే దిశగా విచారణ జరుగుతోంది. రెండు రోజుల పాటు ఈ లెక్కలు తేలుస్తామని, అప్పటివరకు ఎంతమొత్తంలో నగదు పక్కదారి పట్టిందనే అంశంపై పూర్తిస్థాయి వివరాలు వెల్లడించలేమని జిల్లా ట్రెజరీ కార్యాలయ అధికారులు తెలిపారు. అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అయినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు.



జిల్లా ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కీలక అధికారి పాత్ర ఎంత..?

అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో కొన్ని నెలలుగా పింఛనుదారులకు సంబంధించిన సొమ్మును నకిలీ ఖాతాల ద్వారా సొంతానికి మళ్లించినట్లు

మిగతా 6లో..

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

- ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు..
- పరీక్షలకు హాజరయ్యే వారికి మాత్రమే..
- హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపిస్తే చాలు

8లో

దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై విచారణ

- మహామండపంలో అధికారుల తనిఖీలు

6లో

కొండవాగు కబ్జాపై అధికారుల చర్యలు

- సర్పంచ్ భర్తపై కేసు నమోదు

6లో

రీ సర్వేకు రైతులు సహకరించాలి

- గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (శని)
సహర్ (ఉదయం) : 5-01 (ఆది)

అసెంబ్లీ వేదికగా

జర్నలిస్టు సొసైటీ సమస్యలు పరిష్కరించాలి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ సంఘం తరపున జర్నలిస్టులు 17ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ, నున్న మ్యాంగో మార్కెట్ ఎదురు ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం ఉమ్మడి ఏపీలో వైఎస్ ఆర్ 480-2008 ద్వారా సుమారు మూడున్నర ఎకరాలు సొసైటీకి కేటాయించారని చెప్పారు. ఆ తరువాత బైపాస్ రోడ్డు రావడంతో ఎకరం 30 సెంట్లు భూమి పోగా 2.15 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. 2019కి ముందు టిడ్కో ఇళ్లు కట్టి ఇవ్వాలని నాటి సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోలేదని, పలువురు పాత్రికేయులపై కక్ష సాధింపుతో కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సొసైటీలో 150 మంది వరకు ఉండగా 14 మంది చనిపోయారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. అలాగే గన్నవరంలో 50 పడకల ఆస్పత్రి అవసరమని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అధునాతన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.



ఎంపీ శివనాథ్‌కు వినతి పత్రం అందచేసిన పెన్షనర్లు

ఎంపీ శివనాథ్‌ను కలిసిన పెన్షనర్లు

» పార్లమెంట్‌లో పెన్షన్ పెంపు ప్రస్తావించాలని వినతి

వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్స్‌లో పనిచేసి రిటైర్ అయిన ఈపీఎస్-95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నేషనల్ యాజిటేషన్ కమిటీ ఎన్టీఆర్ జిల్లా సభ్యులు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని కలిశారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఎంపీని కలిసి తమకు ఈపీఎఫ్‌వో పెన్షన్ స్కీమ్ కింద ఇచ్చే పెన్షన్‌ను కోషియారి కమిటీ సిఫార్స్ ప్రకారం కనీస పింఛన్ రూ.7,500లతో పాటు కరువుభత్యం కలిపి ఇచ్చే అంశం పార్లమెంట్‌లో ప్రస్తావించాలని వినతి పత్రం అందచేశారు. పార్లమెంట్‌లో తమ సమస్యను ప్రస్తావించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఈ.పి.ఎస్.95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున దేశవ్యాప్తంగా ఎంపీలందరికీ వినతి పత్రాలు అందచేస్తున్నట్టు తెలిపారు. వారి సమస్యను తెలుసుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించి లోక్‌సభలో ఈ అంశం ప్రస్తావనకు తీసుకువస్తానని చెప్పారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌతిండియా జాయింట్ సెక్రటరీ ఎల్.మురళీ కృష్ణ, నేషనల్ జాయింట్ సెక్రటరీ కె.సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు కొల్లిపర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకస్వాములు

కనకదుర్గమ్మ సేవలో నీతి అయోగ్ సభ్యుడు

ఇంద్రకీలాద్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం, ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



అన్న వితరణకు విరాళం..

విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన గొట్టుముక్కల సత్యనారాయణ రాజు, కుటుంబ సభ్యులతో శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని, అన్నవితరణ నిమిత్తం అధికారులకు రూ.1,11,116లను చెక్కు అందజేశారు.

కొండవాగు కబ్జాపై అధికారుల చర్యలు

» సర్పంచ్ భర్తపై కేసు నమోదు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డు ప్రాంతంలో కొండవాగు స్థలం కబ్జాపై అధికార యంత్రాంగం చర్యలకు దిగింది. కబ్జా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి అక్రమంగా విక్రయాలకు ప్రయత్నించిన సర్పంచ్ భర్తతో పాటు మరికొందరిపై రెవెన్యూ అధికారులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని 1.2 ఎకరం కొండ పోరంబోకు భూమి కబ్జాకు గురైన విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'కొండ వాగులో కబ్జాకోరులు' కథనానికి స్పందించిన సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్డీవో కావూరి చైతన్య, రూరల్ ఎమ్మార్వో బి.సుగుణ, ఆర్ఐ రాజేష్ కబ్జాస్థలం పరిశీలించారు. సదరు స్థలం సర్వే నెంబరు 151/2లో ఉన్న ప్రభుత్వ స్థలంగా నిర్ధారించారు. అనంతరం సర్పంచ్ భర్త కాటూరి శ్రీను కబ్జాకు పాల్పడటమే కాకుండా కోర్టు ఉల్లంఘనకు పాల్పడినట్టు నున్న రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాటూరి శ్రీనుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, రెవెన్యూ అధికారులు



దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై విచారణ

ఇంద్రకీలాద్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చీరల గోల్‌మాల్‌పై దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ నియమించిన విచారణ కమిటీ సభ్యులు శుక్రవారం మహామండపంలోని చీరల విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. గుంటూరు డిప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేష్, తూర్పుగోదావరి, పెద్ద అవుటపల్లి గ్రూప్ టెంపుల్ సూపరింటెండెంట్ కె.ఎల్.ఎస్.శెట్టి, రాజమండ్రిలోని ఆర్జేసీ కార్యాలయం సూపరింటెండెంట్ టి.సుబ్రహ్మణ్యంలు చీరల విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆర్డర్ కాపీలు, ఇతర వివరాలను పరిశీలించారు. లీజెస్ విభాగంలో చీరల టెండర్ ఎప్పుడు? ఎన్నిసార్లు నిర్వహించారు.. నిబంధనలు పాటించారా.. తదితర అంశాలను పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చీరల అవకతవకల సమయంలో విధులు నిర్వహించిన గుమస్తాలు టి.సుబ్రహ్మణ్యం, కె.రమేష్, మధులను శనివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం. శనివారం ప్రధాన ఆలయం, ఫెస్టివల్ సెక్షన్‌లో ఉద్యోగులను విచారించనున్నారు. వివరాలను గతంలో విచారణ అధికారిణిగా పనిచేసిన దేవస్థానం ఏఈవో సుధారాణి తెలియజేశారు.

చెరువు కట్టకు మోక్షం!

» వైసీపీ ప్రభుత్వ హయాంలో తెగిన కట్ట

» యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

» హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



కట్ట తెగిన చిన్నపంపుల చెరువుకు మరమ్మతులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

పట్టణవాసుల నీటి అవసరాలను తీర్చేందుకు 48,105 ఎకరాల విస్తీర్ణంలో రెండు పంపుల చెరువులున్నాయి. నాలుగేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో చిన్న చెరువు కట్ట తెగిపోయి లక్షలాది లీటర్ల మంచి నీరు కాలువలు, డ్రెయిన్లలో కలిసింది. నాడు మంత్రిగా ఉన్న కొడాలి నాని కట్ట మరమ్మతులు చేపడతామని హడావుడి చేసి వెంటనే అంచనాలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించి చేతులు దులుపుకున్నారు. ఐదేళ్ల కాలంలో నాని పంపుల చెరువును పరిశీలించిన సందర్భాలు చాలా తక్కువ. చిన్న చెరువు కట్ట తెగినా ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు.

అంతంతమాత్రంగా కట్టల పటిష్టత

పూర్తిస్థాయి సామర్థ్యంతో చెరువులను నింపాల్సిన అధికారులు పెద్ద చెరువు కట్ట పటిష్టతపై అనుమానాలు ఉండటంతో నీటి సామర్థ్యం 1686 మిలియన్ లీటర్లు కాగా, 11 అడుగుల మేర నింపారు. చిన్న చెరువు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 634 మిలియన్ లీటర్లు కాగా, 200 మిలియన్ లీటర్లు నీటిని మాత్రమే గతంలో నింపేవారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తవటంతో పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

> గుడివాడకు శాశ్వత ఎమ్మెల్యే అని చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అధికారంలో ఉండగా పట్టణ వాసుల నీటి కష్టాలు తీర్చే సమయమే లేకపోయింది. నాని మంత్రిగా ఉన్న సమయంలో తెగిన చిన్న పంపుల చెరువు కట్టకు మరమ్మతులు చేయాలనే ఆలోచన కూడా చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై తెగిన చిన్న పంపుల చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదని ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నీటిని నిల్వ చేసేందుకు మరో సంప్ వెల్ నిర్మాణానికి రూపకల్పన చేస్తు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

కనీస అవసరాలకు నీరు అవసరం

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలంటే రోజుకు 1.25 కోట్ల లీటర్ల నీరు అవసరం ఉంది. దానికి అనుగుణంగా చెరువుల్లో నీటిని నింపుకోవాలి. చెరువు కట్టలు బలహీనంగా ఉండటంతో పూర్తిస్థాయిలో అధికారులు నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. రెండు చెరువులను పూర్తిస్థాయిలో నింపితేనే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడవచ్చు. పట్టణంలో టిడ్కో కాలనీ విలీనంతో నీటి కష్టాలు మరింత పెరిగాయి. రెండు రోజులకొకసారి నీటిసరఫరా చేసినా సరిపోవడం లేదని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

మరో సంప్‌వెల్ అవసరం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద అండర్ గ్రౌండ్ సంప్‌వెల్ నిర్మించారు. క్లోరినేషన్ అనంతరం నీటిని నిల్వ చేసేందుకు మరో సంప్‌వెల్ అవసరముంది. పట్టణంలోని తొమ్మిది ఎలివేటెడ్ రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని పూర్తిస్థాయిలో నింపకపోవడం, అవసరానికి తగ్గట్టుగా పంపింగ్ చేయలేకపోవడం, నిల్వచేసుకునే వీలులేకపోవడం, విద్యుత్ కోతలు వంటి కారణాలతో నీరు పూర్తిస్థాయిలో ప్రజలకు అందడంలేదు.

సమస్యకు సత్వర పరిష్కారం : వెనిగండ్ల

పట్టణవాసుల తాగునీటి కష్టాలను వార్డు పర్యటనల్లో గుర్తించా.. చిన్న చెరువు కట్టకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నాం, పూర్తిస్థాయిలో చిన్న చెరువును నింపుతాం. చెరువుల కట్టలు పటిష్ఠ పరిచి పంపింగ్‌కు విద్యుత్ అంతరాయం రాకుండా ఆ శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాం. పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్య ఉత్పన్నమవ్వకుండా చర్యలు తీసుకుంటాం.

భువనమ్మ వచ్చారు.. రారండి

» భువనేశ్వరి రాకతో కోమరవోలు వాసుల్లో ఆనందోత్సాహం



భువనేశ్వరిని సత్కరిస్తున్న మహిళలు, ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

పామర్రు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిమ్మకూరు పర్యటనకు వచ్చిన ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణను కలిసిన కోమరవోలు వాసులు.. ఒక్కసారి మీ అమ్మమ్మ గ్రామమైన కోమరవోలుకు రావాలని కోరగా బాలయ్య వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఖంగుతిన్న విషయం తెలిసిందే.. అయితే ఆ షాక్‌లో ఉన్న కొమరవోలు వాసుల్లో బాలయ్య సోదరి, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి శుక్రవారం కోమరవోలు రావడం వారిలో నూతన ఉత్తేజం నింపడమేగాక వారి ఆనందానికి అవధుల్లేకుండా చేసింది. భువనమ్మ వచ్చింది రండి.. అంటూ మహిళలు సందడి చేశారు. భువనమ్మ గ్రామానికి రావడం అంటే స్వర్గీయ ఎన్టీఆర్ వచ్చినట్టుగా ఉందని మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో గ్రామానికి రావడం గ్రామస్థులు చేసుకున్న పుర్వజన్మ సుకృతమన్నారు. ఆయన కుమార్తె అయిన భువనేశ్వరమ్మ దత్తతతో గ్రామం ఎంతో అభివృద్ధికి నోచుకోవడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. భువనమ్మతో సెల్ఫీలు దిగేందుకు డ్వాక్రా సంఘాల మహిళలు పోటీపడ్డారు. వృద్ధులు భువనేశ్వరిని మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు వెనుక ఎంతో ధైర్యంగా నిలబడి పార్టీశ్రేణుల్లో ఉత్సాహం కలిగించి విజయానికి దోహదకారిగా నిలిచిన ఘనత భువనమ్మదే అన్నారు. రాబోయే రోజుల్లో ఆమె ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళతామని వర్ల చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, సివిల్ సప్లయిస్ చైర్మన్ రావివెంకటేశ్వరరావు, కొమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, మాజీ జడ్పీటీసీ పెద్దువీరభద్రరరావు, జీవన్‌శక్తి అధినేత కాట్రగడ్డ రమేష్, కొమరవోలు సర్పంచ్ దిరిశం రత్నకుమారి, మండల దేశం పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, గోట్టిపాటి లక్ష్మీదాసు, కృష్ణాడెల్టా సాగునీటి సంఘ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, దాలిపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



మేళమర్తిలంక వద్ద క్షేత్రస్థాయిలో సమస్య పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మోపిదేవి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తరచిరువోలు లంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. దీర్ఘకాలంగా ఉన్న భూముల సమస్యల సత్వర పరిష్కారానికి రీ సర్వే ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూములకు సంబంధించి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మేళ్లమర్తిలంక గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి నాగరాజు రెవెన్యూ రికార్డుల ప్రకారం తనకు ఎకరం 10 సెంట్లు వారసత్వంగా సంక్రమించిందని, ప్రస్తుతం సర్వే చేసి హద్దులు నిర్ణయించగా, 90 సెంట్లు మాత్రమే చూపిస్తున్నాని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సర్వేలో అధికారుల నిర్లక్ష్యం వల్లే భూమి పూర్తిగా రావటం లేదని చెప్పడంతో సర్వే ఏడీ ఎం.జోషి ఆధ్వర్యంలో మండల సర్వేయర్ల బృందం కలెక్టర్ సమక్షంలో భూమి కొలతలు నిర్వహించారు. వెబ్ ల్యాండ్ ఆన్‌లైన్ ప్రకారం కొలతలు నిర్వహించినా 90 సెంట్లు మాత్రమే రావటంతో హద్దుదారులను పిలిచి కలెక్టర్ మాట్లాడారు. పూర్వకాలంలో రిజిస్ట్రేషన్ ప్రమాణికం కాదని, ప్రస్తుతం ఆన్‌లైన్ సర్వే హద్దుల ప్రకారమే భూమిని నిర్ధారించుకోవాల్సిందిగా తెలియజేశారు. రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించి సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు నీలికాంత్, ప్రశాంత్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లెక్క చిక్కేనా..?

(5వ పేజీ తరువాయి)

అధికారుల విచారణలో వెల్లడైంది. కేవలం పింఛన్ సొమ్మే కాకుండా, ఇతరత్రా బిల్లుల రూపంలోనూ నగదును నకిలీ ఖాతాలకు పంపించారని తెలుస్తోంది. ఈ అంశం మూడు, నాలుగు నెలల క్రితమే అధికారుల పరిశీలనలో వెల్లడైంది. అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు, జిల్లా ట్రెజరీ కార్యాలయంలోని ఓ కీలక అధికారికి నెలవారీగా నడిచే ఆర్థిక సంబంధాల కారణంగా ఈ అంశాన్ని బయటకు రానివ్వలేదని ఆ కార్యాలయ ఉద్యోగులే చెప్పుకొంటున్నారు. అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వాన్ని మోసంచేసి రూ.1.50 కోట్లకు పైగా నగదును మళ్లించుకున్నా, సంబంధిత ఉద్యోగులపై.. పోలీసులకు గానీ, ట్రెజరీ విభాగం ఉన్నతాధికారులకు గానీ ఫిర్యాదు చేయకుండా జిల్లా ట్రెజరీ కార్యాలయ అధికారులు కావాలనే జాప్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆడిట్ జరిగిన సమయంలో, ప్రధాన ట్రెజరీ కార్యాలయ అధికారుల పరిశీలనలో నగదు పక్కదారి పట్టిందనే విషయం వెల్లడయ్యే వరకు జిల్లా ట్రెజరీ కార్యాలయ అధికారులు.. అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనించదగ్గ అంశం. జిల్లా ట్రెజరీ కార్యాలయ అధికారులకు తెలియకుండా ఒక్క రూపాయి కూడా వేరే వ్యక్తుల ఖాతాలకు జమ కాదని, ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి ఒకరు ఇటీవల అనారోగ్యం పాలై నెలపాటు సెలవులో ఉన్నారని, ఈ సమయంలోనే ఈ అక్రమ నగదు బదిలీ వ్యవహారం వెలుగుచూసిందని ఉద్యోగుల మాట. అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో కీలక ఉద్యోగి లాగిన్ నుంచి నగదు బదిలీ అయ్యిందని, ఆ ఉద్యోగిని ఈ వ్యవహారం నుంచి బయట పడేసేందుకు తెరవెనుక మంత్రాంగం నడుస్తోందని అనుకుంటున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

- ఎస్.రవికుమార్, జిల్లా ట్రెజరీ అధికారి

అవనిగడ్డ సబ్‌ట్రెజరీ కార్యాలయంలోని రికార్డులను స్వాధీనం చేసుకున్నాం. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్కడి సిబ్బంది నగదును దారి మళ్లించారని గుర్తించాం. విచారణ పూర్తయిన తరువాత పక్కదారి పట్టిన నగదును రికవరీ చేస్తాం. అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లా ట్రెజరీ కార్యాలయ అధికారులకు ఈ వ్యవహారంతో సంబంధం లేదు.

'ఓపెన్'గా మాస్ కాపీయింగ్

(5వ పేజీ తరువాయి)

నడవని జూనియర్ కళాశాల పేరున కూడా హాల్ టికెట్లు రావటం విచిత్రం. రెగ్యులర్ ఇంటర్ లేని కళాశాలకు ఓపెన్ ఇంటర్ సెంటర్ ఇవ్వకూడదన్న నిబంధనను కూడా అతిక్రమించారు. జిల్లా కలెక్టర్ హెచ్చరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పరీక్షల కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన వ్యక్తి స్థానంలో నియమించిన అధికారి కూడా పట్టించుకోవట్లేదు. ఏదైనా ఆరోపణలపై వివరణ కోరితే.. తనకేం సంబంధం లేదని, డీఈవోను అడగాలని సమాధానమిస్తున్నారు. పరీక్షల పర్యవేక్షణ నుంచి డీవైఈవో స్థాయి అధికారిని ఎందుకు తప్పించారో ఇన్విజిలేటర్లకు కూడా అర్థంకాని పరిస్థితి. కాగా, నియోజకవర్గంలో ఒక మండలంలో ఉన్న జూనియర్ కళాశాల పీఆర్వోను రెండు రోజుల క్రితం పట్టణంలోని విద్యార్థులు నిలదీశారు. తమకు పాస్ గ్యారెంటీ అని, పరీక్షల మేనేజ్‌మెంట్ అంతా తమదేనని వేల రూపాయాలు వసూలుచేసి, పరీక్షల్లో ఏమి సహాయం చేయట్లేదని నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకుని పీఆర్వోను పంపించేశారు.

నందిగామలోనూ..

నందిగామలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ పరీక్షల్లోనూ భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడి మూడు పరీక్షా కేంద్రాల్లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అత్యధికులు ఇతర ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వస్తున్నారు. ఏఐ కో-ఆర్డినేటర్‌గా ఉన్న హెచ్‌ఎంలకు సిట్టింగ్ స్క్వాడ్‌లో అవకాశం కల్పించినట్టు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదులు రావటంతో వారిని విధుల నుంచి తొలగించాలని జిల్లా అధికారులు చూస్తున్నారు. వీరి ద్వారానే మాస్ కాపీయింగ్ జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.

మామిడి రెడీ..

(5వ పేజీ తరువాయి)

కాలంగా లోకల్ మండీ వ్యాపారులతో దిగుమతులు కొంతమేర తగ్గాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కొనుగోలుదారులతో లోకల్ మండీలు, పెద్ద రైతులు సత్సంబంధాలు కలిగి ఉండటంతో పలువురు ఇతర రాష్ట్ర కొనుగోలుదారులు నేరుగా తోటల వద్దకు వెళ్లి ఎగుమతులు చేసుకుంటున్నారు.

ఈ ఏడాదిపైనే ఆశలు

కరోనా కారణంగా దెబ్బతిన్న వ్యాపారులు ఈ ఏడాదిపై ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లపాటు వ్యాపారాలు లేక వెలవెలబోయిన దుకాణాలు గత ఏడాది కొంతమేర పుంజుకున్నాయనే చెప్పొచ్చు. ఈ ఏడాది ఆశాజనకంగా ఉంటుందనే ఆశలో వ్యాపారులు, రైతులు ఉన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసు అధికారులు

అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు

» జల్సాల కోసం.. పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీలు

» మూడు రాష్ట్రాల్లో 32 వరకు కేసులు

» 25 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్లు

» ఆధారాలు దొరక్కుండా చేయటంలో సిద్ధ హస్తుడు

జగ్గయ్యపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మూడు రాష్ట్రాలు.. 32 చోరీలు, చదివింది ఇంటర్.. అయినా ఆధారాలు దొరక్కుండా చేయటంలో సిద్ధహస్తుడు. జగ్గయ్యపేట విష్ణుప్రియనగర్‌లో డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్ ఇంట్లో చోరీకి పాల్పడి, సీసీ కెమెరాల దృష్టి మార్చి, హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకుపోయిన ఘటనలో అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా పాండురంగాపురానికి చెందిన సంపతి ఉమాప్రసాద్ అలియాస్ ఉమా(24)ను పోలీసులు అరెస్టు చేశారు. నందిగామ ఏసీపీ తిలక్ జగ్గయ్యపేట సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉమాను హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, నిందితుడు మైనర్‌గా ఉన్నపుడే తెలుగు రాష్ట్రాల్లో 25 చోరీలకు పాల్పడ్డాడని, మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్నాడని చెప్పారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చినా చోరీలు ఆపలేదని, గతనెలలో జగ్గయ్యపేట విష్ణుప్రియానగర్‌లో చోరీకి పాల్పడ్డాడని చెప్పారు. వేలి ముద్రలు దొరక్కుండా చేతికి గ్లౌజులు వేసుకుంటాడని, గ్యాస్ లైటర్ తరహాలో చిన్న గ్యాస్ కట్టర్ ఉపయోగించి తాళాలు కోయటం, స్క్రూడ్రైవర్ లాంటి చిన్న చిన్న పరికరాలతో చోరీలకు పాల్పడతాడని వివరించారు. నిందితుడిపై 32 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సూచనలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడి కదలికలను గుర్తించినట్టు చెప్పారు. నిందితుడు గరికపాడు వద్ద నందిగామలో చోరీ చేసిన బంగారాన్ని విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. అతడి నుంచి రూ.20లక్షల విలువ చేసే గ్రా.220ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

- కొద్దిరోజుల క్రితం బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలో నల్లపూసల గొలుసు తెంపుకుని వెళ్లిన ఘటనలో నిందితుడు ఖమ్మం జిల్లా ముత్తవరం గ్రామానికి చెందిన గలంజీపల్లి శేఖర్ (27)ను అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ తెలిపారు. రెండు కేసుల్లో తక్కువ సమయంలో నిందితులను పట్టుకోవటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు జి.రాజు, బీఈ వెంకటేశ్వరరావులను ఏసీపీ అభినందించారు.

కుమార్తెను చూసేందుకు వచ్చి..

అడవి పందుల ఉచ్చుకు బలి!



మృతుడు రాజు

జగ్గయ్యపేట రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కుమార్తెను చూసేందుకు వచ్చి.. సరదాగా వియ్యంకుడితో కలిసి పొలానికి వెళ్లిన వ్యక్తి అడవి పందుల ఉచ్చుకు బలయ్యాడు. చిల్లకల్లు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గౌరవరానికి చెందిన కత్తుల సుధాకర్, గొర్లెపాటిరాజు వియ్యంకులు. గురువారం రాత్రి సుబాబుల్ తోటకు నీరు పెట్టేందుకు ఇద్దరూ కలిసి వెళ్లారు. ఆ ప్రాంతంలో నందిగామ డీవీఆర్ కాలనీకి చెందిన జగన్నాథం గోపి, యాటగిరి నాగార్జునలు సుబాబుల్ తోట సమీపంలో అడవి పందుల కోసం ఉచ్చులు పెట్టి దానికి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేచిఉన్నారు. విషయం తెలియని రాజు, సుధాకర్‌లు పొలంలోకి అడుగు పెట్టగానే విద్యుత్ షాక్‌తో రాజు(47) మృతి చెందగా సుధాకర్ తృటిలో తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని నిందితులను పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

రెండు కుటుంబాల్లో విషాదం

రాజు తన పెద్ద కుమార్తెకు గౌరవరానికి చెందిన కత్తుల సుధాకర్ కుమారుడితో వివాహం జరిగింది. రాజు భార్య, కుటుంబసభ్యులు గుంటూరులో జరిగే కార్యక్రమానికి వెళ్లగా రాజు కుమార్తె ఇంటికి గౌరవరం వచ్చాడు. రాత్రి భోజనానంతరం సుధాకర్ పొలం వెళుతుండటంతో రాజు కూడా వెళ్లి మృత్యువాత పడ్డాడు. రాజు మృతి రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

టెన్షన్.. టెన్షన్..

(5వ పేజీ తరువాయి)

ప్లాట్లు కొన్నారు. వారికి గతంలో జీపీఏ కింద రిజిస్ట్రేషన్లు చేయటం జరిగింది. వివిధ కారణాల వల్ల ఒకటి, రెండు రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో అందులోని లొసుగులను ఆధారంగా చేసుకుని ఉద్యోగులకు ఆ ప్లాట్లు చెందకుండా నాని అనుయాయులు అడ్డుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం జరిగింది.

- గుడివాడ పట్టణంలో కల్యాణమండపం దగ్గర తమ అనుయాయులకు చెందిన వెంచర్‌లో ప్లాట్లను విక్రయించారు. ఆ తర్వాత ఆ భూములను ఉద్దేశపూర్వకంగా 22ఏలో చేర్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్లాట్లు కొన్న వారికి అవి అమ్ముకోవటానికి అవకాశం లేకుండాపోయింది. ఈ వ్యవహారంలో కూడా పలువురు బాధితులు కేసులు పెట్టడానికి ఇటీవలే సమావేశాన్ని నిర్వహించినట్టు తెలుస్తోంది.
- గుడివాడలో 25 ఎకరాల మేర దేవదాయ భూముల వివాదం ఎప్పటినుంచో నడుస్తోంది. దీనిపైనా ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశాలు ఉన్నాయి.
- పుట్టగుంటలో చేపల చెరువు అక్రమ తవ్వకాలకు సంబంధించి విజిలెన్స్ ఇప్పటికే విచారణ జరుపుతోందని తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

పెనమలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో నూతన భవనాలకు శంకుస్థాపనతో పాటు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ప్రాజెక్ట్ ఎక్స్‌పో సందర్శన సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న నమూనాలను ఈ సందర్భంగా పరిశీలించారు. ఎం రాజయ్య, లక్ష్మణరావు, నాగభూషణం, లలిత ప్రసాద్, రత్నప్రసాద్, పాండు రంగారావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్

గోవా మద్యం పట్టివేత

- ఎ. సీతారాంపురంలో 10ఫుల్, 10 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలం లోని ఎ.సీతారాంపురంలో అక్రమ మద్యాన్ని (గోవా మద్యం) ఎస్పీఎఫ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. గన్నవరం ఎక్సైజ్ సీఐ సురేఖ, ఎస్సై చందా అల్లూరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎ.సీతారాంపురం గ్రామానికి చెందిన పసుపు లేటి శంకరయ్య వద్ద గోవా మద్యం 20 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుమారు రూ. 24వేల విలువైన 10 ఫుల్ బాటిళ్లు, 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శంకరయ్యపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై అల్లూరయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా హనుమాన్‌జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఏఈ జి.బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలోని కె.సీతారాంపురం, బాపులపాడు, ఎస్.ఎన్.పాలెం, ముందుడుగు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులకు దాతలు పోషకాలతో కూడిన అల్పాహారం అందించడం అభినందనీయమని హెచ్‌ఎం నిర్మల అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లోని 110మంది టెన్త్ విద్యార్థులకు లంక రత్నకిషోర్, లక్ష్మి దంపతులు అల్పాహారం శుక్రవారం అందజేశారు. సుంకర వెంకటేశ్వరరావు, ఉషశ్రీ దంపతుల జ్ఞాపకార్థం విద్యార్థులకు అల్పాహారం అందించినట్లు కుమార్తె శ్రీలక్ష్మి తెలిపారు. అమృతపల్లి సూర్యనారాయణ, ఎం రవీంద్ర, నళినీకాంత్, ఆనంద్ పాల్గొన్నారు.

తుప్పుమట్టి!

- మట్టిలో కలుస్తున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- లక్షల్లో ప్రజాధనం వృథా

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు నగర పంచాయతీకి చెందిన వాహనాలు దశాబ్దాల తరబడి నిరుపయోగంగా ఉంటూ తుప్పుపట్టి మట్టిలో కలసి పోతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం మట్టి పాలవుతుంది. ఉయ్యూరు పంచాయతీగా ఉండగా చెత్త తరలింపునకు కొనుగోలు చేసిన ట్రాక్టరు, నగర పంచాయతీగా రూపాంతరం చెందిన తరువాత కొను గోలు చేసిన ట్రక్కు, రిక్షాలు, ఇతర ఇనుప సామగ్రి సంవత్సరాల తరబడి వినియోగించకుండా వృథాగా ఉండటంలో పాడైపోయి తుప్పపట్టి మట్టిలో కలసి పోతున్నాయి. ట్రాక్టరు చెడిపోయి మరమ్మతులకు నోచుకో పోవడం వలకల, ట్రక్కు కూడా ఏళ్ల తరబడి వినియోగించకుండా వృథాగా ఉంచడం వల్ల మట్టిపాలవుతున్నాయి. చెత్తతరలింపునకు ప్రైవేట్ ట్రాక్టర్లు ఉపయోగించుకుంటూ వారిచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి లక్షల రూపాయలు కాంట్రాక్టరుకు చెల్లిస్తున్నారు.వినియోగించేందుకు ఉపయోగపడని వాహనాలను వేలం వేస్తే, కొంత ఆదాయం నగరపంచాయతీకి సమకూరుతుంది. అధికారుల అలసత్వంతో నగర పంచాయతీకి సమకూరే సొమ్ము నిలిచిపోతుంది. వృథాగా మారిన వాహనాలను చూసిన సామాన్యులు సైతం అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి వృథాగా పడి ఉంటున్న వాహనాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చెత్త తరలించే రిక్షాలు





నగర పంచాయతీ కార్యాలయంలో తుప్పుపట్టి మట్టిలో కలసిపోతున్న ట్రాక్టర్, ట్రక్కు

మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు

వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షెరీనా బేగం



సదస్సులో మాట్లాడుతున్న వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షెరీనా బేగం

ప్రసాదంపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మహిళలకు తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సాధిస్తారని, ఇప్పటికే మహిళలు వంటింటి కుందేళ్లు అన్న నానుడిని చెరిపేస్తూ అన్నీ రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షెరీనా బేగం అన్నారు. శుక్రవారం ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో ఉన్న విద్యతో పాటు క్రీడలు, పారిశ్రామిక, రక్షణ, పరిశోధన వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతు న్నారన్నారు. మహిళలు ఆత్మనూన్యత భావాన్ని విడిచి పెట్టి ఆత్మ విశ్వా సాన్ని నింపుకు న్నప్పుడే ఎంతటి విజ యమైన సొంతమ వుతుందని ప్రముఖ గైనకాల జిస్టు మైనేని పూజిత అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బి. అప్పారావు, కార్యదర్శి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, అకడమిక్ డీన్.కె రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయ ఇంజనీరింగ్ కళాశాలలో..

విద్యార్థినులు నిత్యం పుస్తకాలనే కాకుండా ఆటవీడుపుగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, దీనివల్ల మానసికంగా ధృడంగా ఉంటారని విజయ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎనికేపాడులోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో సావిషేకర్-2025 ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు కూచిపూడి, భరతనాట్యం, ఫ్యాషన్ షో ప్రదర్శించి ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో కో - ఆర్డినేటర్ వై. విజయ, విభాగాధిప తులు పి. సుబ్బయ్య, వి. రాఘవలక్ష్మి, టి. విష్ణుప్రియ, కె.మురళి, జి. మధుశ్రీ పాల్గొన్నారు.



విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాషన్ షో



మహిళా దినోత్సవ సభలో ఆర్డీవో హెలా షారోన్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉయ్యూరు : మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో బీఎస్ హెలా షారోన్‌తో పాటు ప్రముఖ రంగాల్లోని ప్రముఖ మహిళలను ఘనంగా సత్కరించారు. రీజియన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, సెక్రట రీ రాంబాబు, దినవహి ప్రసాద్, నల్లా శ్రీనివాస్, పూర కిషోర్, హసన్ పాల్గొన్నారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎన్ కళ్యాణి, భువనేశ్వరీ దేవి, సుభాషిణి తదితరులను సత్కరించారు. ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొనా న్నరు. మండల కార్యాలయంలో ఎంపీడీ వో శేషగిరిరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించి మహిళా ఉద్యోగులను సత్కరించారు.



శేషుమాధవికి అవార్డు అందజేస్తున్న సినీనటులు సుమన్, దివ్యవాణి

కానూరి శేషుమాధవికి జాతీయ అవార్డు

గన్నవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీకేఆర్ వృద్ధాశ్రమ, అమ్మ చిల్డ్రన్స్ హోం చైర్ పర్సన్ కానూరి శేషుమాధవికి జాతీయ అవార్డు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్‌లో పాన్ ఇండియా సోషియో కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైరింగ్ ఉమెన్ పేరిట జాతీయ అవార్డులను శుక్రవారం అందజేశారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో వృద్ధాశ్రమం, చిల్డ్రన్స్ హోమ్ గత పదేళ్లుగా నిర్వహిస్తూ అనాథ పిల్లలు, వృద్ధులకు సేవలందిస్తున్న శేషుమాధవిని ఆసంస్థ గుర్తించింది. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.గోపాలచారి, సినీనటులు సుమన్, దివ్యవాణి చేతుల మీదుగా జాతీయ అవార్డును అందుకున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గన్నవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి సూచించారు. మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో మామిడి రైతులకు శిక్షణను శుక్రవారం నిర్వహించారు. తొలుత ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జె.జ్యోతితో కలసి మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మీ మాట్లాడుతూ, మామిడిపూత, పిందె దశలో ఉన్న తోటలలో ఉన్న తేనె మంచు పురుగు, పక్షి కన్ను తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉద్యానవనశాఖ జిల్లా అధికారి జ్యోతి మాట్లాడు తూ, రైతులకు 50శాతం రాయితీపై కవర్‌లు ఇస్తున్నామని, అవసరం ఉన్న రైతులు ఉద్యానవన సిబ్బందిని సంప్రదించాలని కోరారు. హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్, హార్టీకల్చర్ సహాయకులు దీక్ష, కౌశిక్, భవాని, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు నల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ శివప్రసాద్

ఉంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్ హెచ్చరించారు. మండలంలోని 27గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గత ఏడాది గ్రామాల్లో జరిగిన పనులపై రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎస్.అచ్యుతరావు నేతృత్వంలో డీఆర్పీలు, వీఎస్‌లతో కూడిన ఐదు బృందాలు గ్రామాల్లో తనిఖీ చేసి గుర్తించిన లోపాలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ కే.శ్రీనివాసరావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ ఎన్.సురేష్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ జయప్రసాద్, ఏపీవో టి.వినీల, ఇన్‌చార్జి ఈసీ కె.నాగరాజు పాల్గొన్నారు.



ధనుష్ 2 కె 25లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు

ముగిసిన ధనుష్ 2 కె 25

కంకిపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ధనేకుల ఇంజినీరిం గ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి శాస్త్ర సాంకేతిక, సాంస్కృత సమ్మేళనం ధనుష్ 2కె25 శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల మాట్లాడుతూ, ధనుష్ 2కె25కి 85 కళాశాలల నుంచి 7500 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి ధనేకుల భవాని ప్రసాద్, వివిధ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పునాదిపాడు పాఠశాలకు ఫ్యాన్ అందజేత

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నీరుకొండ శేషుకుమారి అన్నారు. పునాదిపాడు జడ్పీ పాఠశాలకు అవసరమైన ఫ్యాన్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నీరుకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లు ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు

గన్నవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్ధవరం పంచాయతీ శివారు రాజీవ్ నగర్ కాలనీకి సరిహద్దులోని ఎస్టీబీఎల్ కాలనీ ఎదుట ఉన్న తమ స్థలంలో వేసిన సరిహద్దు రాళ్లను కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయటంపై పోలీస్ స్టేషన్‌లో భూ యజమానులు దొండపాటి వెంకటేశ్వరరావు, గుమ్మడి ఉషారాణి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. దీనిపై విచారణ జరిపి నిందితులను అరెస్టు చేయటంతో పాటు తగిన చర్యలు చూసుకోవాలని కోరారు.

నవ సమాజ నిర్మాణమే పీ4 సర్వే ధ్యేయం

ఉంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా 2047 నాటికి పేదరికంలేని నూతన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ నెల 8నుంచి 18వరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్(పీ-4) సర్వే ను గ్రామ సచివాలయాల సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభంకానున్న పీ-4 సర్వేపై మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల సిబ్బందికి స్థానిక స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సూర్య ప్రకాష్‌నాథ్, పీఆర్ ఏఈ జీ.శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన పీ-4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) సర్వే కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలని బాపులపాడు మండల పరిషత్ ఏవో టి.త్రినాధరావు అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పీ-4 సర్వే నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, చాగంటిపాటి ఆంజనేయులు సర్వేపై అవగాహన కల్పించారు.

ధీర వనితలు!

పురుషాధిక్య ప్రపంచంలో మేము సైతం అంటున్నారు. అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో ఆకాశమంత ఎదిగి అబలలం కాదు ధీర వనితలం అని నిరూపించుకున్నారు. స్వశక్తితో ఎదిగి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సమాజ సమూల మార్పులో సమర్థనీయ పాత్ర పోషిస్తున్నారు. విభిన్న రంగాల్లో విజయతీరాలకు చేరిన మగువలూ..మీ తెగువకు వందనం.. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

-(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/ జగ్గయ్యపేట /విజయవాడ కల్చరల్)

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- స్వశక్తితో ఎదిగి..సమాజానికి స్ఫూర్తిగా నిలిచి
- విభిన్న రంగాల్లో రాణిస్తున్న మగువలూ.. మీ తెగువకు వందనం!



హోమ్‌గార్డుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కలెక్టర్ డీకే బాలజీ సతీమణి పృథ్వి కల్యాణి, ఎస్పీ గంగాధరరావు సతీమణి పద్మజ



ప్రసంగిస్తున్న భారతీయం చైర్మన్ సత్యవాణి

మహిళలు..దివ్యశక్తి స్వరూపిణులు

మచిలీపట్నం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు దివ్యశక్తి స్వరూపిణులని, మహిళలు లేనిదే సమాజ అభివృద్ధి లేదని భారతీయం చైర్మన్ సత్యవాణి అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ అధ్యక్షతన పోలీసు కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సత్యవాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళా హోమ్‌గార్డులను సత్కరించారు. మహిళలు చేసిన వంటకాలను కలెక్టర్ డీకే బాలజీ సతీమణి పృథ్వీ కల్యాణి, ఎస్పీ గంగాధర రావు సతీమణి పద్మజ, కొల్లు నీలిమ రుచి చూశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు కొల్లు నీలిమ బహుమతులు అందజేశారు.

ఆరోగ్యకర సమాజం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సైకాలజిస్ట్ ప్రియ



స్త్రీలలో కొందరు 40 ఏళ్లు దాటిన తర్వాత కేన్సర్ బారిన పడటం సైకాలజిస్ట్ ప్రియను కలవరపరిచింది. దీంతో మహిళలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఆహారం వల్ల మనిషి ప్రవర్తన(న్యూట్రిజినోమిక్స్), తీసుకునే ఆహారపు అలవాట్లు(న్యూట్రి జనటిక్స్) అనే అంశాలపై కేఎన్‌ఓటీఎస్ ఫౌండేషన్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పలు అవార్డులు అందుకున్నారు. ఆహారం కారణంగానే 11 నుంచి 12 ఏళ్లకే బాలికలు రజస్వల అవుతున్నారని, రక్తహీనతపై బాలికలకు, వారి తల్లులకు అవగాహన ఉండాలంటున్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

వెయ్యి మందికి అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి మహిళా పెళ్లికి ముందే అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో నాట్స్ ఫౌండేషన్ స్థాపించి ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై పని చేస్తున్నాం. అంతర్జాతీయ సౌత్ కొరియన్ సంస్థతో కలిసి వెయ్యి మందికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రాష్ట్రంలోను, జిల్లాలోను వీటికి సంబంధించిన ఆఫీసుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

-ప్రియ, సైకాలజిస్టు, విజయవాడ

వైకల్యాన్ని లెక్కచేయని సేవా తత్పరురాలు బొప్పన రాధ

తనకు వైకల్యం ఉందన్న విషయాన్ని బొప్పన రాధ పట్టించుకోరు. నడవలేనంత మాత్రాన ఏపనీ ఆగకూడదనేని ఆమె ఆలోచన ఇప్పటి వరకు 180 మందిని వీల్‌ఛైర్స్ రూపంలో నడిపిస్తోంది. పోలియోతో కాలు చచ్చుబడినా ఆర్టీసీలో ఫార్మసిస్టుగా పని చేసి వాలంటరీ రిటర్మెంట్ తీసుకుని తన సంపాదనతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అమ్మమాట అమ్మాయి బాట అనే యూ ట్యూబ్ ద్వారా ఆన్‌లైన్‌లో చీరల వ్యాపారం ప్రారంభించారు. తన సంపాదనలో వచ్చిన సొమ్ముతో ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కాళ్లలేని వారికి 180కి పైగా ట్రై సైకిల్స్ వితరణ గావించారు. 34 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. నలుగురితో చిరు వ్యాపారాలు పెట్టించారు. సేవా కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళలు స్వతంత్రంగా ఎదగాలి



ప్రతి మహిళా స్వతంత్రంగా ఎదగాలి. దివ్యాంగులపై జాలి, సానుభూతి చూపడం కంటే వారిలో ధైర్యం నింపి వారి పని వారు చేసుకునేలా చూడటం మంచిది. నడవలేకపోవడం లోపమే కాదు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళా తన కాళ్ల మీద తాను నిలబడాలి ఎవ్వరి మీద ఆధారపడకూడదు.

- బొప్పన రాధ, విజయవాడ

జగ్గయ్యపేటలో లీడింగ్ సీఏ సాయి సుస్మిత



పెళ్లయ్యాక కూడా చదువుకుని పిన్న వయస్సులోనే సీఏ పూర్తి చేసి, ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రాంతంలో లీడింగ్ సీఏగా ఉన్నారు పెనుగొండ సాయి సుస్మిత. విజయవాడకు చెందిన ఆమె తండ్రి మురళీ కృష్ణ డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేస్తుంటారు. తల్లి రాధిక గృహిణి. ఇంటర్ ఎంఈసీ చేస్తుండగా సీఏ చేయాలని సుస్మిత నిర్ణయానికి వచ్చింది. తర్వాత సీఏ ఇంటర్, సీపీటీ పూర్తి చేశారు. సీపీలో జాతీయస్థాయిలో 11వ ర్యాంకుకు సమానమైన మార్కులు సాధించింది. సీఏ ఇంటర్ పూర్తి కాగానే జగ్గయ్యపేటకు చెందిన సీఏ పెనుగొండ బదరీ నారాయణ కుమారుడు రాజీవ్‌తో వివాహమైంది. పెళ్లయ్యాక ఏడాదిలోపే సీపీటీ పూర్తి చేసింది. అప్పుడే అమలులోకి వచ్చిన జీఎస్టీ కొత్త చట్టం సవాళ్లను అధిగమించింది. గృహిణిగాను సుస్మిత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. నాలుగేళ్ల తన కుమారుడి బాధ్యతలు తానే చూసుకుంటుంది.

నాతో పాటు 30 మందికి ఉపాధి

సీఏ బ్రహ్మపదార్థం కాదు. ఇష్టపడి చదివితే సాధించవచ్చు. వ్యాపార నిబంధనలు తెలుసుకుంటే పన్ను చెల్లింపుల వ్యవహారం క్లిష్టమేమి కాదు. నాతో పాటు 30 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

- సాయి సుస్మిత, సీఏ, జగ్గయ్యపేట

తలసేమియా బాధితుల సేవలో డాక్టర్ పిన్నమనేని కల్యాణి



జనవారధి సర్వీస్ సొసైటీలో డైరెక్టర్‌గా ఉన్న ఏకైక మహిళ డాక్టర్ పిన్నమనేని కల్యాణి. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 524 మంది తలసేమియా బాధిత పిల్లలను దత్తత తీసుకుని వారికి రక్తదానం చేయిస్తూ ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు. బాధితుల రక్తం మార్పిడికి అవసరమైన రూ.1,550 విలువైన రక్త ప్యాకెటును తమ సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నారు.

రక్తం ఇప్పిస్తే మరింత మందికి సేవ చేస్తాం

ప్రభుత్వ ఆర్గనైజేషన్లకే రక్తదానం చేస్తున్నారు. మాలాంటి ప్రైవేటు ఆర్గనైజేషన్(జన వారధి సర్వీస్ సొసైటీ)కు రక్తదానం చేయడం లేదు. అయినా మేము క్యాంపులు నిర్వహించి వచ్చిన రక్తంలో 30 శాతం ప్రభుత్వ వైద్యశాలలకు అందిస్తున్నాం. రక్తదాతల నుంచి మాకు రక్తం ఇప్పిస్తే మరింత మందికి సేవ చేస్తాం. ప్రభుత్వ వైద్యశాల ముందు తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సులు పెట్టాలని ప్రయత్నిస్తున్నాం. త్వరలో సదస్సులు నిర్వహిస్తాం.

- డాక్టర్ పిన్నమనేని కల్యాణి, విజయవాడ

సమాజ సేవకి కోయ సుధ



మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తూ ఇప్పటి వరకు 11 వేల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లు పంపిణీ చేయించారు మైలవరం మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె చిన్న నాటి నుంచి సమాజానికి ఏదో చేయాలనే తపనతో ఉండే వారు. పెళ్లి అయి, పిల్లలతో బిజీగా ఉన్నా ట్రస్టు పెట్టి ఎందరో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల శిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ, బ్యూటీషియన్, పచ్చళ్ల తయారీ, మగ్గాల శిక్షణ, కారం పొడి తయారీ, స్కిల్ నేర్పించడంలో శిక్షణ ఇప్పించారు. 8 గ్రామాల్లో వేల మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. నాబార్డు, ఎన్నారై, ఇతర దాతల సాయంతో రైతులకు అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి నెలా అనాథలకు, రోగులకు ఉచితంగా భోజనం అందించడం, హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారు. పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు చెల్లిస్తుంటారు.

సేవ చేయాలనే తపన

చిన్నతనంలో నా కళ్ల ముందు జరిగిన ఓ రోడ్డు ప్రమాదం నన్ను కలచి వేసింది. అప్పటి నుంచి తోటి వారికి ఎలా సహాయం చేయాలా అని ఆలోచించాను. నా వద్ద ఉన్న దానితో పాటు దాతల సాయమూ తీసుకుని ట్రస్టు స్థాపించాను. ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించగలిగే స్థాయికి ఎదిగాను. ప్రతి మహిళా తన కాళ్ల మీద తాను నిలబడగలిగేలా ఎందులో ఒకదానిలో శిక్షణ ఇచ్చాం. ఇస్తూనే ఉన్నాం.

- కోయ సుధ, మైలవరం

స్త్రీ సమర్థతకు చిహ్నం డాక్టర్ సిరిపురపు పద్మజ



విద్య, విజ్ఞానం, మార్గదర్శకత్వం... ఈ మూడు లక్షణాలు కలిగిన మహిళ డాక్టర్ సిరిపురపు పద్మజ. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేస్తూ, దుర్గా మల్లేశ్వర మహిళా కళాశాలను ఉత్తమ విద్యా సంస్థగా తీర్చి దిద్దడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల మేథో వికాసాన్ని ప్రోత్సహిస్తూ, వారిని విభిన్న రంగాల్లో ఉన్నతులుగా నిలిచేందుకు మంచి మార్గాన్ని చూపారు. ఆమె నిబద్ధత, కృషికి గుర్తింపుగా 2019లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు, భారత మహిళా శిరోమణి అవార్డు వంటి ప్రతిష్టాత్మక గౌరవాలు ఆమె ప్రతిభను చాటుతున్నాయి. కేవలం తరగతి గదిలో బోధన మాత్రమే కాకుండా, యూత్ రెడ్ క్రాస్ కార్యక్రమాలు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, హార్ట్‌ఫుల్ ఇనిస్టిట్యూట్ వంటి సంస్థలతో కలిసి విద్యార్థుల్లో సేవా భావనను పెంపొందించడంలో ఆమె పాత్ర ప్రత్యేకం. కళాశాల ప్రిన్సిపాల్‌గా, విద్యార్థుల కోసం ఉత్తమ విద్యా విధానాన్ని అమలు చేయడమే కాకుండా, ప్రభుత్వ అవార్డులతో ప్రశంసలు అందుకున్నారు. కళాశాల అభివృద్ధికి పాటుపడటం ఆమె నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనం.

యాడ్స్ వ్యాపారంలో దూసుకెళ్తున్న మంజుల

ఎమ్ఆర్ యాడ్స్ పేరుతో ఎం.మంజుల వ్యాపార(ప్రకటనల బోర్డుల) రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం తన భర్త రాజాతో ఆలోచన పంచుకుని ఎమ్ఆర్ యాడ్స్ పేరుతో నగరంలో వ్యాపారాన్ని ప్రారంభించారామె. చిన్న వ్యాపారులు లక్షలు వెచ్చించి 10-20 సైజుల్లో హోర్డింగ్స్ పెట్టించలేరని వారి వ్యాపార సామర్థ్యం మేరకు వారు పబ్లిసిటీ చేసుకునేలా 4-3 సైజులో పోల్ యాడ్స్‌కు డిజైన్ చేసి అందులో విజయం సాధించగలిగారు. తన భర్త రాజా 2018లో కన్నుమూశారు. ఆమె ఏమాత్రం కుంగిపోలేదు. పోటీ వ్యాపార సంస్థలు ఆమెపై ప్రత్యక్ష, పరోక్ష దాడి చేసినా వాటన్నింటిని తట్టుకుని ఇప్పటికీ మార్కెట్‌లో నిలబడిగలిగారు. ఇతర దేశాలకు వెళ్లి అక్కడ హోర్డింగ్స్ వ్యాపార ప్రకటనలకు వాడే బోర్డుల తయారీలో మెళకువలు తెలుసుకుని ఇక్కడ వాటిని వైవిధ్య భరితంగా అమలుచేశారు. మంచి మహిళా వ్యాపార వేత్తగా మన్ననలు పొందుతున్నారు. ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

పని పూర్తి చేసే వరకు నిద్రపోను



ఏ విషయాన్ని నేను ఈజీగా తీసుకోను. పని పూర్తి చేసే వరకు నిద్రపోను. వ్యాపారాన్ని నా భర్త నేను కలిసి ప్రారంభించినా తొలి రోజుల్లో ప్రకటనల కోసం వచ్చే వారు మీ భర్త ఉన్నారా అని అడిగేవారు నాకు ఆశ్చర్యం వేసేది. ఆడవారు అంటే ఎందుకంత చులకన అనిపించేది. అవుట్ డోర్ పని మీరెలా చూసుకుంటారు అనే వారు. అయినా నేను నిలబడ్డాను. సాధించాను. వినూత్న ఆలోచనలతో వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించాను. పోటీ ఎంత ఉన్నా ఎదుటి వారిని బాధించకుండానే వ్యాపారం చేశాను అదే నా విజయ మంత్రం.

-ఎం.మంజుల. ఎమ్ఆర్ యాడ్స్ అధినేత, విజయవాడ

సాంకేతిక రంగంలో సత్తా చాటుతున్న డాక్టర్ వాసవి



సాంకేతిక రంగంలో సత్తా చాటారు 27 ఏళ్ల అనుభవం కలిగిన ప్రముఖ అధ్యాపకురాలు, పరిశోధకురాలు డాక్టర్ ఎస్.వాసవి. ప్రస్తుతం ఆమె వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. ఇస్రో, డీఎస్టీ, ఐఈఈఈ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో రూ.1.5కోట్ల విలువైన నాలుగు పరిశోధన ప్రాజెక్టులు నడిపిస్తున్నారు. 109కి పైగా పరిశోధన పత్రాలు ఎస్‌సీఐ, స్కోపస్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. మూడు పేటెంట్లను ఆమె సాధించుకున్నారు. ఇల్లినాయిస్ స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయాలతో కలిసి ఆమె పనిచేస్తున్నారు. ఐఈఈఈ ఐసీవోఐపీ(సింగపూర్), ఐఈఈఈ కాన్ఫరెన్స్(పారిస్), ఐఈఈఈ ఐఈఎంసీవోఎన్(కెనడా) వంటి అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌లో కీలక పాత్ర పోషించారు. ఆమె కృషికి ఇండియన్ ఉమెన్ అచీవర్స్ అవార్డు(ఐడబ్ల్యూఏ 2024), ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఔట్‌స్టాండింగ్ ఉమెన్ ఇంజినీరింగ్ అవార్డు వంటి అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించాయి. వాసవి పరిశోధనలోనే కాకుండా, కొత్త తరానికి మార్గనిర్దేశం చేసే గురువుగా నిలిచారు. ఆమె సాధించిన విజయాలు సాంకేతిక రంగంలో మహిళలు సమానంగా రాణించగలరనే విషయాన్ని నిరూపిస్తున్నాయి.

నేడు పది మంది మహిళలకు పురస్కారాల ప్రదానం

మచిలీపట్నం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పది మంది మహిళలకు శనివారం పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని డీఆర్డీయే పీడీ వై.హరిహరనాథ్ తెలిపారు. మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో గోడ సంపత్ హేళాషరున్, ప్రధాని, రాష్ట్రపతి వద్ద వీణా వాదనం చేసిన అప్పికట్ల దీప్తి, మిద్దెతోటలు పెంచి సీఎం చంద్రబాబు నుంచి అవార్డు తీసుకున్న ముంతాజ్ బేగం, 70 ఏళ్ల వయసులో క్రీడా రంగంలో 75 పతకాలు సాధించిన క్రీడాకారిణి తోట విజయకుమారి, విద్యార్థులకు భగవద్గీత నేర్పుతూ మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి నుంచి స్వర్ణపతకం పొందిన టీటీడీ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి, ప్రముఖ కథా రచయిత్రి మేరీ కృపాబాయి, వాసవీ మహిళా మండలి ప్రతినిధి వేముల శిరీష, చిలకలపూడిలో అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న సామాజిక సంఘ సేవకురాలు కరెడ్ల సుశీలకు పురస్కారాలు అంజేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులకు ఒకే రోజు రూ.5 కోట్ల ఆర్డర్లు

- గిన్నీస్ రికార్డులో చోటు
- అందులో జిల్లా ఉత్పత్తులు ఇమిటేషన్ జ్యువెలరీ, కలంకారీ వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, అగరొత్తులకు అగ్రస్థానం

స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ఒకే రోజు రూ.5 కోట్ల ఆర్డర్లు లభించాయని, ఇది గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందని డీఆర్డీయే నూతన ప్రాజెక్టు డైరెక్టర్ వై.హరిహరనాథ్ తెలిపారు. ఇందులో జిల్లాలోని మచిలీపట్నంలోని రోల్డుగోల్డు నగలతో పాటు పెడన కలంకారీ వస్త్రాలు, చిట్టూర్పులో తయారు చేసిన జనపనార బ్యాగులు, అగరొత్తులు, ఫినాయిల్‌కు ఆన్‌లైన్‌లో అధిక ఆర్డర్లు లభించాయని ఆయన తెలిపారు.

డీఆర్డీయే కృష్ణా పీడీగా వై.హరిహరనాథ్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఆర్డీయే పీడీ వై.హరిహరనాథ్

మచిలీపట్నం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి కృష్ణాజిల్లాకు డీఆర్డీయే పీడీగా వచ్చిన వై. హరిహరనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ బాలాజీని కలిశారు. మొక్కను అందజేశారు. అనంతరం డీఆర్డీయే కార్యాలయంలో సిబ్బందితో హరిహరనాథ్ మాట్లాడారు.

తోట్లవల్లూరు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సస్పెన్షన్

- టీఏ పోస్టులకు నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు!



కిరణ్‌కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీవో

తోట్లవల్లూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్(ఏపీవో), ఇంజనీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) జి.కిరణ్‌కుమార్‌ను డ్వామా పీడీ సస్పెండ్ చేశారు. కిరణ్ సస్పెండ్ విషయాన్ని మండలానికి చెందిన ఓ అధికారి శుక్రవారం నిర్ధారించారు. పలువురు సిబ్బంది కూడా కిరణ్‌కుమార్ సస్పెండ్ చేశారని తెలిపారు. కిరణ్‌కుమార్ స్థానంలో లక్ష్మారెడ్డిని గత శనివారం నియమించారని సిబ్బంది తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉంటున్నట్టు డ్వామా పీడీ సస్పెండ్ చేశారని, కాని వేరే అవినీతి కారణాలున్నాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. ఉపాధిహామి పథకంలో టెక్నికల్ అసిస్టెంట్(టీఏ) పోస్టులు ఇప్పిస్తానని తోట్లవల్లూరు మండలంలో ఏడుగురు వ్యక్తుల నుంచి రూ.60 వేల చొప్పును కిరణ్‌కుమార్ వసూలు చేసి మోసగించాడనే ఆరోపణలు రావటంతో డ్వామా పీడీ సస్పెండ్ చేశారంటున్నారు. ఇంకా పమిడిముక్కల, మొవ్వ, గన్నవరం మండలాల్లో ఇదే విధంగా డబ్బులు వసూలు చేసి మోసిగించినట్టు కిరణ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయని చెపుతున్నారు. రాష్ట్రంలో పలు మండలాల్లో టీఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాను టీఏ పోస్టులు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు మండల అధికారి వెల్లడించారు.

విద్యారంగ సంస్కరణలతో మారుతున్న దేశ ముఖచిత్రం

- సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్



స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న యూజీసీ చైర్మన్ మామిడాల జగదీష్ కుమార్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య

మొగల్రాజపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణలతో దేశ ముఖ చిత్రం మారుతోందని, ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం చర్యలు తీసుకుంటోందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన విద్యావిధానం 2020లో మార్పులతో విద్యార్థికి చదువుకునే కోర్సుల్లో పరిమితులు తీసేశారన్నారు. డిగ్రీ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌తో సంబంధం లేకుండా నచ్చిన పీజీ కోర్సులు తీసుకోవచ్చని తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రాంప్ట్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధ లాంటి టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని సూచించారు. దేశ అవసరాలకు అనుగుణంగా నూతనంగా ఆలోచించాలని, పరిశోధనలు పెరగాలని, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు కొత్త కోర్సుల బోధనపై దృష్టిపెట్టాలన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థలు ఏర్పాటై యాభై సంవత్సరాలు అవడం అభినందనీయం అన్నారు. ఎంతో మంది సిద్ధార్థ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు, బ్యూరోక్రాట్లు, న్యాయాధిపతులు, పారిశ్రామికవేత్తలు, కళాకారులు, ఇంజనీర్లు, డాక్టర్లుగా ఉండడం గర్వకారణమని సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు అన్నారు. ఈరోజు డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగిందన్నారు. స్వర్ణోత్సవ లోగోను మామిడాల జగదీష్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రొఫెసర్ మధుమూర్తి, కృష్ణాయూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉషా, రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమీషనర్ కేవీ చౌదరి పాల్గొన్నారు.

మైనింగ్ మినరల్ రంగంతో రాష్ట్రాలకు గణనీయ ఆదాయం



సమావేశంలో పాల్గొన్న నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ వి.కె. సారస్వత్, ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ తదితరులు

భారతీనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ మినరల్ రంగం దేశంలో మౌలిక సదుపాయాలు, నిర్మాణం, తయారీ పరిశ్రమలకు వెన్నెముకగా నిలుస్తోందని, ఈరంగం లక్షలాది మంది జీవనోపాధికి మద్దతుగా నిలుస్తోందని, రాష్ట్రాల గణనీయ ఆదాయాలకు ఇది దోహదపడుతోందని నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్ తెలిపారు. దేశంలో మైనింగ్ మినరల్ రంగాన్ని క్రమబద్ధీకరించడానికి, బలోపేతం చేయడానికి ఎఫ్ఈఎంఎంఐ, ఎన్ఐటీఐ ఆయోగ్, కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ సమక్షంలో నోవోటెల్ హోటల్‌లో శుక్రవారం మైనర్ మినరల్ మైనింగ్‌లో అవకాశాలు, సవాళ్లపై జాతీయ సదస్సు నిర్వహించారు. నీతిఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్, ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, ఐఐటీ-ఐఎస్ఎం ప్రొఫెసర్ ఆర్ ఎం భట్టాచార్జీ పాల్గొన్నారు. పర్యావరణ అనుమతుల ఆలస్యం, మైనర్ మినరల్స్ ఆక్షన్లు మైనర్ మినరల్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఐదారేళ్లగా రాష్ట్రంలోని 4 వేల మైన్లలో 2వేల మైన్లు మూతపడ్డాయని ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ మీనా చెప్పారని తెలిపారు. మైనింగ్ నియంత్రణా అడ్డంకులు గుర్తించడం, ఏకరీతి మైనర్ ఖనిజ విధానాన్ని ప్రతిపాదించడం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ఇండియా మినరల్ ఇండస్ట్రీస్, ఫెమ్మి, మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు, సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్పులో మా ప్రమేయం లేదు

- తహశీల్దార్ వనజాక్షి మామ పొట్లూరి వెంకటేశ్వరరావు

వన్‌టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి యలమర్రు సబ్ స్టేషన్ వరకు వెళ్లే 220 కేవీ లైన్ అలైన్‌మెంట్ మార్పులో తమ ప్రమేయం లేదని తహశీల్దార్ వనజాక్షి మామ, రిటైర్డ్ అధికారి పొట్లూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వనజాక్షి... ఇదేం పని? 220 కేవీ అలైన్‌మెంట్ మాయ కథనంపై ఆయన స్పందించారు. 2003లో పెదపారుపూడి సబ్ స్టేషన్‌కు వచ్చే 110 కేవీ లైన్ సబ్ స్టేషన్ తూర్పు వైపు తమ కుటుంబ సభ్యులకు చెందిన భూముల నుంచి వచ్చాయని తెలిపారు. ఆరోజు రైతులకు ఉపయోగపడుతుందని తాము ఎలాంటి నష్టపరిహారం కోరలేదని తెలిపారు. గత ఏడాది గ్రామ మంచినీటి చెరువులో శివాలయం నిర్మించడానికి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ప్రయత్నించారన్నారు. జలవనరుల శాఖకు చెందిన ఎటువంటి కట్టడాలు నిర్మించరాదని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గ్రామంలో కొందరు కలెక్టర్‌ను సంప్రదించారని తెలిపారు. అధికారులు తనిఖీ చేసి చెరువులో శివాలయం నిర్మించడానికి అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. దీంతో కక్షతో కొందరు తమపై బురద జల్లుతున్నారని ఆయన పేర్కొన్నారు.

త్వరలో వైసీపీ ఖాళీ

- ఆ పార్టీ కీలకనేతలు జనసేనలో చేరబోతున్నారు
- జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఉదయభాను

విద్యాధరపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో తాడు, బొంగరం లేని ఏకైక పార్టీ వైసీపీ. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తన కేసులు గురించే చూసుకుంటున్నారు. వైసీపీలో కీలక నేతలు జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వైసీపీ పని అయిపోయింది. త్వరలో ఆ పార్టీ ఖాళీ అవబోతోంది.' అని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం భవానీపురం హెచ్‌బీ కాలనీలోని వీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో భవానీపురానికి చెందిన వైసీపీ నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 200 మంది జనసేన పార్టీలో చేరారు. ఉదయభాను వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలు జగన్‌కు అధికారం ఇస్తే రావణకాష్టంగా మార్చారన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌ను ఇక ఎన్నటికీ నమ్మబోరన్నారు.

పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

బస్ స్టేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించి పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చని పేర్కొన్నారు.

12న పార్శిళ్ల బహిరంగ వేలం

విజయవాడ ఆర్టీసీ పార్శిళ్ల విభాగంలో నెలల తరబడి ఉన్న పార్శిళ్లకు, కస్టమర్లు బుక్ చేసుకుని వదిలేసిన పార్శిళ్లకు ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

10న అప్రంటీస్ మేళా

భారతీనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ మేళాను సోమవారం ఉదయం 9గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.కనకారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో అన్ని ట్రేడ్‌లకు చెందిన శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఈ మేళాకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 7780429468 నంబరుకు ఫోన్‌చేసి సంప్రదించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

టిడ్కో కాలనీకి రవాణా సౌకర్యం : వెనిగండ్ల హామీ

గుడివాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి దూరంగా ఉన్న టిడ్కో కాలనీ, సమీపంలోని ఎన్టీఆర్ కాలనీ వాసులకు రవాణా ఇబ్బందులు తొలగించేలా ఆర్టీసీ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. మీ కోసం-మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఆయన పర్యటించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని ముఠా కార్మికులతో ముచ్చటించారు. హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఠా కార్మికులు తమకు రవాణ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే కాలనీ వాసులకు రవాణ సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



హమాలీలతో మాట్లాడుతున్న వెనిగండ్ల

దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : గుడివాడరూరల్ మండలంలోని మోటూరు గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బూరగడ్డ సంజీవని పేర్కొన్నారు. ఐదో తరగతిలో చేరటానికి, మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరటానికి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఈ నెల 13వతేదీ లోగా ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీఎస్టీ అభ్యర్థులకు అవకాశం ఉందని తెలిపారు. మోటూరు గురుకుల పాఠశాలలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, విద్యార్థి సెల్ నెంబర్ తీసుకొస్తే వెంటనే తమ సిబ్బంది పిల్లల చేరికకు ఆన్‌లైన్ దరఖాస్తు చేయిస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యువకుడి మృతి

పెదపారుపూడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తీవ్ర మనస్థాపానికి గురై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెదపారుపూడిలో చోటుచేసుకుంది. జొన్నపాడు గ్రామానికి చెందిన శ్యామ్ ప్రవీణ్ కుమార్ (22) మనస్థాపానికి గురైన గురువారం రాత్రి తమలంపాడు శివారులోని పొలాల గట్టు దగ్గర పురుగుల మందు కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆయన మరణించాడు. పెదపారుపూడి ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి , ఏఎస్ఐ ప్రకాశరావు తన సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

● ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలో ప్రజలు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడరూరల్): గుడివాడ రూరల్ మండలం సీపూడి గ్రామంలో గత ఆరేళ్ల నుంచి విద్యుత్ తీగెలు కిందకు వేలాడుతున్నా ఎవరు పట్టించుకోకపోవటంతో ప్రజలు భయపడుతున్నారు. రాత్రి సమయంలో పాదచారులు ఈ రహదారిలో బిక్కుబిక్కుమంటూ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు ఈ రహదారిలో నడవాలంటే ఏ విద్యుత్ తీగె తెగి మీద పడుతుందేమోనని తీవ్ర భయాందోళనలకు గురవ్వాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఐదేళ్ల క్రితం సీపూడి వెళ్లే రహదారి పక్కన నూతన విద్యుత్ స్తంభాలను వదిలేసి వెళ్లారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగెలను సరిచేయాలని ప్రజలు విద్యుత్‌శాఖాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సీపూడి వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి, తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



సీపూడిలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగెలు



రహదారి పక్కన వదిలేసిన విద్యుత్ స్తంభాలు

అధికారులు పట్టించుకోవడం లేదు

విద్యుత్ శాఖ అధికారులకు చాలా సార్లు వినతిపత్రాలు అందజేశాం. ఎవరూ పట్టించుకోవటం లేదు. గ్రామస్థులందరం కలిసి డీఈ కార్యాలయానికి వెళ్లి నూతన స్తంభాలు వేసి విద్యుత్ వైర్లు వేయాలని కోరుతున్నా అధికారులు, సిబ్బంది అసలు మా గ్రామం వైపే చూడటం లేదు.



గుంజా మోహన దత్తు

విద్యుత్ లైన్లు వేయని మాట వాస్తవమే..

విద్యుత్ లైన్లు వేయని మాట వాస్తవమే. ఏడు నెలల కిందట విద్యుత్ వైర్లు వేయటానికి పంచాయతీకి రూ.1.50 లక్షలు కట్టాలని డిమాండ్ నోటీసు పంపాము. పంచాయతీ వారు కట్టని కారణంగా విద్యుత్ వైర్లు, విద్యుత్ బల్బులు వేయలేదు.

సూర్య ప్రకాశరావు, విద్యుత్ శాఖ ఏఈ

ఐదోరోజుకు గంగానమ్మతల్లి జాతర

పామర్రు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహాతల్లిగా పూజలందుకుంటున్న పామర్రు గంగానమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం ఐదోరోజుకు చేరుకుంది. తెల్లవారుజామునే ఆలయం నుంచి డప్పువాయిద్యాల మధ్య బయలుదేరిన అమ్మవారిఘటం, పోతురాజుగెడల సంచార యాత్ర పూర్వపు మునసబు వారసుల ఇంటివద్ద తొలి నైవేద్యం స్వీకరించారు. అనంతరం స్థానిక కోటిరెడ్డిపేట, నాగులేరుగట్టు, చౌదరిపేట, యాదవపురం తదితరప్రాంతాల్లో కొనసాగింది. ప్రతిఇంటింటా భక్తులు వేపాకులు, పసుపు కలిపిన నీటిని వారబోసి అమ్మవారిఘటంలో చల్ది నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పసుపు, కుంకమలతో ఓలలాడారు. పూనకాలువచ్చిన మహిళలకు పంబలవారు నిమ్మకాయ, కొబ్బరి టెంకాయలను కొట్టి వాళ్లను శాంతపరిచారు. ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు రామిరెడ్డి, ఇతర సభ్యులు ఆధ్వర్యంలో జాతర ప్రశాంతగా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.



పోతురాజుగెడలకు పూజలు చేస్తున్న భక్తులు

పశువులకు వైద్య పరీక్షలు

పెదపారుపూడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి గ్రామంలో కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పశువులకు ఇన్సూరెన్స్ , వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవికాలంలో పశువులకు 30 నిముషాలకు ఒకసారి నీళ్ల పెడుతూ పశువులను తడుపుతూ ఉంటే పశువులకు ఎండ తీవ్రతను తట్టుకోగలవని డాక్టర్ సందీప్ తెలిపారు. పాల కేంద్రం సొసైటీ అధ్యక్షులు, కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు (విజయా) డైరెక్టర్ పునుకొల్లు రత్న ప్రసాద్ (నాని), సిబ్బంది, వేతన కార్యదర్శి తలారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుడివాడ రూరల్ : బొమ్ములూరు వినాయకుడి గుడివాడ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని శుక్రవారం తెల్లవారుజామున కరపు చరణ్ సాయి మృతి చెందినట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వలందపాలెంకు చెందిన కరపు చరణ్ సాయి, పుప్పాల సునీల్ ద్విచక్ర వాహనంపై వలందపాలెం నుంచి బయలుదేరి వస్తుండగా, బొమ్ములూరు వినాయకుడిగుడి వద్ద వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో చరణ్ సాయి మృతి చెందినట్లు తెలిపారు. వీరు వాళ్ల స్నేహితులు దూర ప్రాంతం నుంచి గుడివాడ రైల్వే స్టేషన్‌కు వస్తున్నారని తెలుసుకుని, వారిని తీసుకురావటానికి గుడివాడ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కూచిపూడి: క్రీడలు విద్యార్థులలోని పోటీతత్వాన్ని పెంచుతూ మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని కృష్ణా జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు డాక్టర్ వేమూరి పరిశుద్ధ రాజు అన్నారు. మొవ్వలోని మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ జరిగాయి. అండర్-16 ఎంపిక సందర్భంగా నిర్వహించిన బాలుర విభాగ పోటీలను పరిశుద్ధ రాజు ప్రారంభించారు. బాలికల విభాగ పోటీలను ఎంఈవో-1 ఎన్.శివశంకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 37 పాఠశాలల నుంచి వచ్చిన 150 మందికిపైగా పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. వివిధ పాఠశాలల నుంచి 35 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కె.లక్ష్మీ, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శివకోటేశ్వరరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రామారావు, మండలి మనోహరి పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి

నందివాడ : తుమ్మలపల్లి శివారు మురుగు కాలువపై ఏర్పాటు చేసిన తూముల వల్ల పరిసర ప్రాంత రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదని రామాపురం మాజీ సర్పంచ్ అందుగుల ఏసుపాదం అన్నారు. శుక్రవారం పరిసర ప్రాంత రైతులతో తూముల వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుపాదం మాట్లాడుతూ కొంతమంది స్వార్థం కోసం లేనిపోని గొడవలు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, సాదం సాంబశివరావు, యాకోబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి



మహిళలను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

తోట్లవల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని , వారికి గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి మనోహర్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం సాయంత్రం మండలయూటీ ఎఫ్‌శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సన్మాన గ్రహీతలు : వల్లూరుపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.స్వరాజ్యలక్ష్మీ, దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని ఎం వీరమ్మ, పెనమకూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని కె సౌజన్య, తోట్లవల్లూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని టి నిర్మల, బొడ్డపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని వి సుమలత, రొయ్యూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని నళినీకుమారి, చాగంటిపాడు పాఠశాల ఉపాధ్యాయిని ఫ్లోరెన్స్, భద్రిరాజుపాలెం పాఠశాల హిందీ టీచర్ పి. కుసుమకుమారి, సౌత్‌వల్లూరు ఉర్దూ స్కూల్ టీచర్ దిల్షాద్ బేగం, సౌత్‌వల్లూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బి. సునీత, దేవరపల్లి ప్రాథమిక పాఠశాల(స్పెషల్) టీచర్ చంద్రకళ, మహిళా పోలీస్ సీహెచ్ శిరీషా, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి, అంగన్వాడీ టీచర్ జె. భాగ్యం, వల్లూరుపాలెం జెడ్పీ హైస్కూల్ కుకింగ్ ఏజెన్సీ ఎ. లక్ష్మీలను శాలువాలతో సత్కరించి భారత తొలి వ్యోమగామి కల్పనాచావ్లా చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మైథిలీ, ఎం విజయశ్రీ, బి. కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : మహిళ సాధికారికత, స్వతంత్ర నిర్ణయాలను ప్రోత్సహించే దిశగా నేటి సమాజం మహిళలకు మద్దతివ్వాలని సాయి ఉషోదయ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు తుమ్మల రత్న తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్ పర్సన్ డి.విమలకుమారి అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యాతిధిగా విచ్చేసిన తుమ్మల మాట్లాడుతూ లింగవివక్షలేని సమాజం వైపు అడుగులు వేయడం, సమాన విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించడం ముఖ్యమన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎ.దుర్గాభవాని, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం : ఎంఈవో

గుడివాడ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవో బాలాజీ అన్నారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో టీచ్ టూల్‌కి సంబంధించి టెక్నికల్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యాశాఖ ఆదేశాలకనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికీ నాణ్యమైన విద్యాబోధన అందించటానికి కృషి చేయాలన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ నాగరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఫణిదూర్జేటి



పెదపారుపూడిలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్



గుడ్లవల్లేరులో ప్రసంగిస్తున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి

పేదరికం లేని సమాజమే ధ్యేయం

పామర్రు,మార్చి7(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్జేస్తున్న పి4(పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేను రూపొందించిందని జిల్లా గిరిజనసంక్షేమశాఖ అధికారి,పామర్రుమండల ప్రత్యేకాధికారి ముదిగొండ ఫణి దూర్జేటి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పి4సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, వార్డుసచివాలయ ఉద్యోగులకు కొనసాగుతున్న శిక్షణాతరగతులకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా సమిష్టిగా ఈసర్వేను విజయవంతం చేయాలన్నారు.సర్వేని పదిరోజుల్లో పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారిణి కె.పద్మజ , మాస్టర్ ట్రైనర్ ఏసుప్రియ, ఎంపీడీవో కె. జ్యోతి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారిపి.వేంకటేశ్వరరావు, మండల, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం పి4 సర్వేపై శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జి.రమేష్ ఎంపీడీవో టి.విజయసారథి, తహసీల్దార్, మండల పరిషత్ ఏ.వో, ఎంఈవోలు, పంచాయితీ కార్యదర్శులు,పాల్గొన్నారు.

పెదపారుపూడి : పేదరికం లేని సమజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్, ప్రభుత్వ, పీపుల్ పార్టనర్ షిప్ (పీ4) సర్వేకు రూపకల్పన చేసిందని , ఈ నెల 8వ తేదీ నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే మండలంలో ప్రారంభమవుతుందని పెదపారుపూడి ఎంపీడీవో వంగా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామ సచివాలయ సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. గుడివాడ డీఎల్‌పీవో ఆనంద కుమార్, మండల ఏఎస్‌వో రత్నారావు, పంచాయతీ కార్యదర్శులు,పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: ప్రభుత్వం అమల్జేస్తున్న ప్రతీ పథకాన్ని ప్రజలకు అందేవిధంగా అధికారులు, కార్యదర్శులు చూడాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల ఉద్యోగులు గ్రామాల్లో సర్వే నిర్వహించి పేదలకు ఏమీ కావాలో చూడాలన్నారు. ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రొండి కృష్ణకు అవకాశం కల్పించాలి

గుడివాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంలో ముఖ్య పాత్ర పోషించిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని యాదవ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక శ్రీకృష్ణ మందిరంలో నియోజకవర్గ యాదవ సంఘ సమావేశం నిర్వహించారు. జిల్లా వెనుకబడిన సంక్షేమ విశ్రాంత అధికారి లాలా లజపతిరాయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ మాట్లాడుతూ కాలపరిమితి పూర్తయిన ఎమ్మెల్సీలు యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తిల స్థానంలో తిరిగి యాదవులకు కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీగా రొండి కృష్ణకు అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శ్రీరామ్, రామ్‌కుమార్, శివరామకృష్ణ, గణపతి, రవి, శివ, రాంబాబు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.420

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

కోడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ డిపాజిట్ ఖాతాలపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వి.రవి అన్నారు. విశ్వనాథపల్లి గ్రామంలోని ఫంక్షన్ హాల్లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాపును శుక్రవారం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కలిగి బ్యాంకింగ్ సేవలను తెలివిగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్సై చాణిక్య సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు, పోస్ట్ మాస్టర్ బాబీ స్టీవెన్ పాల్గొన్నారు.

10 నుంచి నర్సాపురం సర్వీస్ పునరుద్ధరణ

అవనిగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ డిపో నుంచి నర్సాపురం నడుస్తున్న బస్సు సర్వీసును ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. నాగాయలంక నుంచి నర్సాపురానికి పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్న ఆర్టీసీ బస్సును అధికారులు నిలిపివేయటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మత్స్యకారులు, పలువురు నేతలు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లారు. యువ న్యాయవాది బడే గౌతమ్ ఈ విషయమై ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవటంతో స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 10వ తేదీ నుంచి నర్సాపురం బస్సు సర్వీసును పునరుద్ధరిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల న్యాయవాది బడే గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతకు శ్రీకారం

నాగాయలంక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక పంచాయతీలోని పలు వీధులలో పరిశుభ్రత కార్యక్రమాలకు అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలిగా మండల రెవెన్యూ కార్యాలయం రహదారిలో కొద్దిమేర ఎడమ వైపున ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. అనంతరం ఇచ్చట చెత్త వేయరాదని బోర్డులను పెట్టారు. ఇటీవల పంచాయతీశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు నాగాయలంక వచ్చి పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

రెడ్‌క్రాస్ చేయూత

నాగాయలంక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుమొండి శివారు బ్రహ్మయ్యగారి మూల గ్రామానికి చెందిన కన్నా బసవయ్య ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి గురైన కుటుంబాన్ని మండల రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు, తహసీల్దార్ ఎం.హరనాథ్, చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్‌లు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తాత్కాలికంగా నివాసం ఉండుటకు టార్పాన్ పట్టాలు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంట సామగ్రిని వారు బాధితులకు అందజేశారు.

పారదర్శకంగా రీ సర్వే జరగాలి

కలెక్టర్ డీకే బాలాజీ



దక్షిణ చిరువోలులంకలో భూ రీ సర్వేపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామంలో జరిగిన భూ రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో స్వాతి, భూ సర్వే రికార్డుల ఏడి జోషిలతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేసే అధికారులు ఏ పొలాన్ని అయితే సర్వే చేస్తున్నారో ఆ సర్వే నెంబర్‌లోని రైతులను పిలిపించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, అవనిగడ్డ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేకు రూపకల్పన చేసిందని ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీ4 సర్వేపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఈ సర్వేను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏవో మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోపిదేవి : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ4 సర్వేను ఆయా శాఖల ఉద్యోగులు గ్రామాల్లో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి (సీపీవో) గణేష్ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఈవోపీఆర్‌డీ కె.టి.సుందరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడూరు : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 సర్వే నిర్వహిస్తున్నట్టు కోడూరు మండల ఎంపీడీవో సుధా ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా పీ4 సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు.



చెన్నూరులో మహిళా దినోత్సవ ర్యాలీ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పెడన రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాలలోనూ రాణించేందుకు తమను మరింత ప్రోత్సహించాలని చెన్నూరు అంగన్వాడీ కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు గల హక్కులు వాటి ప్రాధాన్యత అంశాలను ప్రజలకు వివరించారు. మహిళలు వారి ఆరోగ్యం, ఆర్థిక విధానాలపై ప్రభుత్వాలు అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జింజేరు, నడుపూరు, కాకర్లమూడి, నందమూరు, కూడురు, నందిగామ ఉరివి గ్రామాలలో మహిళలు ర్యాలీలు నిర్వహించారు.

మచిలీపట్నం టౌన్ : 45వ డివిజన్ సచివాలయంలో విమలా గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మధురగాయని జొన్నలగడ్డ మాధవితో పాటు సచివాలయ మహిళా కార్యదర్శులను సత్కరించారు. టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా నోబుల్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లేడీయాంప్తిల్ ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి, పామర్రు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణలను ఘనంగా సత్కరించారు.

ఆక్రమణల తొలగింపులో వివాదం

- రెండు జేసీబీలను ఆపేసిన బార్ అండ్ రెస్టారెంట్ యజమాని
- మున్సిపల్ అధికారులు, యజమాని పరస్పర ఫిర్యాదు

మచిలీపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) :మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో రహదారుల వెంబ డి ఆక్రమణల తొలగింపు వ్యవహారం వివాదాలకు దారితీసింది. మున్సిపల్ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారని, బార్ అండ్‌రెస్టారెంట్ యజమాని తనకు ఆస్తి నష్టం కలుగజేశారని పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులపై పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. మచిలీపట్నంలోని నాగపోతరావు సెంటరునుంచి చింతచెట్టుసెంటరు వరకు రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు యంత్రాల ద్వారా తొలగించే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సమయంలో వాసవిబార్ అండ్‌రెస్టారెంట్‌కు సంబంధించి బోర్డును యంత్రాల ద్వారా తొలగించడంతో అది దెబ్బతింది. దీంతో బార్‌అండ్ రెస్టారెంట్ యజమాని కొరియర్ శ్రీను అక్కడ పనిచేస్తున్న జేసీబీలను తన మనుషుల ద్వారా తన స్థలంలోకి తీసుకువెళ్లిపోయాడు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులను, మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని మచిలీపట్నం టౌన్‌ప్లానింగ్ అధికారి ఇనుగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో కొరియర్ శ్రీనుపై ఫిర్యాదు చేశారు. తొలగింపులను తాను ఆపలేదని, మున్సిపల్ అధికారులు, జేసీబీ యజమానులు తన ఆస్తికి నష్టం కలిగించారని రెస్టారెంట్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఎస్ఐ బేగ్ విచారణ చేస్తున్నారని ఇనగుదురుపేట సీఐ పరమేశ్వరరావు తెలిపారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ తనిఖీలు

చల్లపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్, డీపీఈ విజిలెన్స్ ఈఈ సీహెచ్.వాసుల ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం లక్ష్మీపురం సెక్షన్ పరిధిలో 32 బృందాలు తనిఖీల్లో పాల్గొన్నాయి. గృహ, వ్యాపార సముదాయాలకు సంబంధించి 2086 సర్వీసులను తనిఖీచేసి 297 సర్వీసులకు అదనపులోడు కింద రూ.7.74లక్షల అదనపు చార్జీలను విధించినట్టు ఈఈ కృష్ణానాయక్ తెలిపారు.

సంక్షోభంలో చేనేత పరిశ్రమ

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు

పెడన, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పవర్‌లూమ్ రంగం నుంచి ఎదురవుతున్న పోటీ, జీఎస్‌టి విధింపు, రిజర్వేషన్ చట్టం అమలు కాకపోవడంతో, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి తదితర కారణాల వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు అన్నారు. సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో శివదుర్గారావు మాట్లాడుతూ పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చలామణి అవుతుండటంతో చేనేత పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటుందన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ, వ్యవసాయం తరువాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర చేతి వృత్తుల సమన్వయ కమిటీ కన్వీనర్ మున్నూరు భాస్కరయ్య, సంఘ కృష్ణాజిల్లా అధ్యక్షుడు వాసా గంగాధరరావు, కార్యదర్శి గోరు రాజు, పంచల నరసింహారావు, నందం చంద్రకళ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న కలెక్టర్

మోపిదేవి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో స్వాతి లు మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో కలెక్టర్‌ను సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను కలెక్టర్‌కు అందించారు.



డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్రామ్

దివిసీమ వైభవం డాక్యుమెంటరీ ఆవిష్కరణ

అవనిగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో అవనిగడ్డ ప్రాంతానికి చెందిన యువకులు రూపొందించిన దివిసీమ వైభవం డాక్యుమెంటరీని జనసేన పార్టీ నేత, బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఐటీ కో-ఆర్డినేటర్ సుధాని నందగోపాల్, బొందలపాటి వీరబాబు, భోగిరెడ్డి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. దివిసీమ చరిత్రను నేటితరం వారికి తెలిసేలా డాక్యుమెంటరీని రూపొందించిన యువతను ఈ సందర్భంగా వెంకట్రామ్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యావ్యవస్థలో క్రమశిక్షణ ముఖ్యం

పెడన, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో క్రమశిక్షణ అనేది ఎంతో ముఖ్యమని, విద్యార్థులలో క్రమశిక్షణ అలవరిచేందుకు పాఠశాలల్లో డ్రిల్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటివి అమల్జేస్తున్నారని పెడన జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అద్దంకి అశోక్‌కుమార్ అన్నారు. ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థి, రిటైర్డు డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఆ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందజేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్‌లు సమయాకాటోన్, కె.ఎన్.వి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోడూరు- అవనిగడ్డ రోడ్డు పనులు చేపట్టాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు బొబ్బా గోవర్ధన్ వినతి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ నాయకులు, ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ కలసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. పామర్రు నుంచి కొడాలి మీదుగా చల్లపల్లి వరకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైందన్నారు. దీంతో విజయవాడ వెళ్లే ప్రయాణీకులు మచిలీపట్నం మీదుగా తమ ప్రయాణాన్ని కొనసాగించాల్సి వస్తుందని పల్లా శ్రీనివాసరావుకు ఆయన వివరించారు. దీంతోపాటు మధ్యలో నిలిచిపోయిన కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి పనులు కూడా వెంటనే ప్రారంభమయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి సహకరించాలని గోవర్ధన్ కోరారు.

బొల్లా రామ్మోహనరావు మృతి టీడీపీకి తీరనిలోటు

గూడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బొల్లా రామ్మోహనరావు మృతి టీడీపీకి తీరని లోటని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. చిట్టిగూడూరు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆకుమర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడు, టాటా ఏసీ డ్రైవర్ బొల్లా రామ్మోహనరావు పార్థివ దేహానికి శుక్రవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మోహనరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోపీ నాగబాబు, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్‌ఏ బేగ్, కాట్రగడ్డ సత్యనారాయణ, తోట వేణు, బత్తిన వీరబాబు, మురాల నాని, ధనుంజయ్, బొల్లా అంకాలరావు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పిలుపు



జనసేన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం చిత్రాడ గ్రామంలో ఈ నెల 14న నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గాయత్రి కన్వెన్షన్ హాలులో జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో జరిగిన సమావేశంలో బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడారు. ప్రతి నియోజకవర్గం నుంచి వేలాది నాయకులు, కార్యకర్తలను పిఠాపురం చిత్రాడ సభకు తీసుకురావాలన్నారు. ఎక్కడా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులను తీసుకురావాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలతో ప్రాంగణం సందడి సందడిగా నెలకొంది.

చల్లపల్లి : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి చల్లపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో చల్లపల్లి, ఘంటసాల మండలాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లు వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్ సర్పంచ్‌లు అంకం మారుతి, డొక్కు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా, ఘంటసాల మండల పార్టీ అధ్యక్షుడు కోన రాజశేఖర్, చల్లపల్లి టౌన్ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, ఐటీ కోఆర్డినేటర్ సూదాని నందగోపాల్, ఆసుపత్రి డైరెక్టర్ తోట కనకదుర్గ, సీనియర్ నాయకులు అడపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.